శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక

Journal of the Telugu Academy

సంవత్సరమునకు చందా మూఁడు రూపాయలు



దేశ భాషలందు తెలుగు లెస్స.

సంపుటము	విలంబి	సంచిక
౪౮	ఆశ్వయుజ కార్తిక మార్గశీర్ష పౌషములు	౪,

విషయసూచిక

ఓం నమః కామేశ్వర్యై.

ఆంధ్రావళి మోదము

శ్రీ వడ్డాది సీతారామాంజనేయ కవి.

శ్రీయుతమూర్తి సద్గుణవిశిష్టుఁ బురాణమువంశసూర్యనా
రాయణతీర్థులన్ సుకవిరాజుఁ గవిత్రయభవ్యభారతా
మ్నాయపరిష్కృతివ్రతసమంచితమానసభాసురున్ గురున్
జేయి మొగిడ్చి మ్రొక్కెదను జిత్తము నీవయి నిల్పి తిక్కనా !

శా. ఆవేశింపవె నామదిన్ సుకవిమిత్రా ! తిక్కనామాత్య ! నీ
సేవాభాగ్యముఁ గన్న మాభవము లుత్సేకించి యానందపా
రావారమ్మున నోలలాడి విమలాంధ్రవ్యక్తిసౌజన్య మా
రా! విశ్వమ్మున కాశ్రయమ్మనఁగుచున్ రాజిల్లుచుండుం గదా!

శా. తాతన్ భాస్కరమంత్రిసత్కవిని సాదర్శమ్ముగాఁ గొన్న నీ
కైతన్ నా కదిరా ! తరంబె పొగడంగాఁ? గుండలీంద్రుండ నీ;
వేతన్మాత్రుఁడ వాక్కా! యాంధ్రజగతిన్ హేలాగతిన్ దేర్చునీ
చాతుర్యమ్మునకున్ నమస్కృతిసహస్రంబుల్ సమర్పించెదన్.

ఉ. నమ్మద మొప్ప జన్నమును జల్పి సుపర్వుల నెల్లఁ దన్పి, ధ
ర్మమ్ము లొనర్చి పండితపరంపరఁ దేర్చుచు, భారతాగమం
బిమ్ముల వ్రాసి యాంధ్రులను దృప్తులఁ జేసిననిన్నుఁ గ
న్నమ్మయు నయ్యయైన యల యన్నమకొమ్మన లెంతపుణ్యులో!

చ. అభినవదండి కేతనమహాకవి నీప్రియశిష్యుఁ డాత్మకున్
బ్రభు వని నీ కిడెన్ దశకుమారచరిత్రము సంకితంబు; నీ
శుభకవితాప్రభావమునఁ జొక్కినయాతఁడె కాక నీమహా
విభవ మెఱుంగఁగాఁగలఁడె వే ఱొకఁ డెంతటిధీరుఁ డేనియున్ ?

చ. తెలుఁగున భారతాగమముఁ దేజ మెలర్ప రచించి యాంధ్రు లా
ర్యులె యగుటల్ నిరూఢిగ నిరూపణముల్ బొనరించినావు పా
త్రలనుచరిత్ర లెల్ల నముదంచితరీతులఁ దీర్చి దిద్ది ధీ
విలసనభాగ్య మాంధ్రులకు నిం దొనరించితి వన్న! తిక్కనా!

మ. తరహా నీకును నిర్ణయించెడి ప్రయత్నం బేల? భాషాంతరీ
కరణం బింతియె భారతం బనుచు వ్యాఖ్యానమ్ములా? స్వేచ్ఛకున్
బరిణామం బిది కా దఁటందుర! కవిబ్రహ్మ! భవద్వాణి త
త్త్వరతత్త్వామృతసాగరంబె కద? యేతత్ప్రజ్ఞ సామాన్యమే?

ఉ. దారుణధోరణిన్ రుధిరధారలు బోరన నొల్కఁ జేయుదు
ర్వారకరాళఖడ్గము భవత్కరపద్మవిభూష నైనబం
గారపుగంటపుల్ సిరికిఁ గాఁగలదే సరి? విప్లవమ్ము శృం
గారపు వైఖరిన్ నెఱపి కావవె తిక్కన! యాంధ్రదేశమున్?

ఉ. జీవము స్వీయజాతికి నజేయముగా వికసించి మించ నా
నావిధవైపరీత్యముల నాశ మొనర్పఁగ భారతశ్రుతి
శ్రీవిభవంబుతో వెలయుచిత్తము నొంది మహాకవిత్వదీ
క్షానిధి సత్యధర్మములఁ గావవె తిక్కన! కర్మయోగివై?

ఉ. నారయ తోడుగాఁగ మును నన్నయ కట్టిన రమ్యమౌ మహా
భారతహర్మ్యమందున విపంచికఁ గైకొని యాంధ్రవాణి సాం
పారెడు నీస్వరూపమున హాయిగఁ బాడదె సామగానముల్?
సూరులు వీరులుం గవులుఁ జొక్కఁగఁ దిక్కన! ధన్యజీవనా!

చ. నరులకు గావ్య మంకిత మొనర్పడు పోతన యన్నఁ దన్మహా
నిరతికిఁ ద్రోవఁజూపితివి నీవె కదా కృతినాథుఁ జేసి యా
హరిహరనాథు భారతమహాకృతి కా మనుమక్షితీశుఁడే
నిరుపమభక్తితత్పరత నిన్ గని నెమ్మదిఁ బొంగిపోవఁడే!

ఉ. ధీరజనానుమోదకరదివ్యశ్రీ భాసిలు వేదవాణియే
భారతజాతి కైక్యముఁ బ్రవర్ధిలఁ జేయఁగఁజాలి యుంట నీ
వారసి ప్రాంతిభాష యగు నాంధ్రము పూర్తిగ నార్యభాసురా
చారసమన్వితం బగుటఁ జాటవె తిక్కన! సోమయాజివై.

ఉ. ఆర్యుఁడ వౌట భారతమునందలి పాత్రలనెల్ల నైజచా
తుర్యము పేర్మిఁ దీర్చి పరితోషముఁ గూర్చితి; వంతె కాదు మా
ధుర్య మెలర్ప నార్యతను దోడనె నిల్పితి వాంధ్రజాతికిన్;
స్థైర్యము నొంది వాసిగ స్వధర్మము భాసిలుఁగాదె? తిక్కనా!

చ. హరిహరనాథతత్త్వమును నాంధ్రుల కీవుపదేశ మిచ్చి శం
కరగురుదేవబోధితజగద్ధితసన్మతదీప్త భారతా
విరళసమైక్యధర్మపటువిస్తృతిఁ జిల్లరమూఁక పోకిళుల్
నఱుముగఁ జేసి ప్రోవవె తెఱుంగుజగమ్మును బ్రహ్మవాదివై

ఉ. వేదనినాదమేదురశ పీనులవిం దగు పాంచజన్యరా
వోదితమాధురీమహిమ, వ్యోమనదీవిచలత్తరంగగీ
తాదృతసౌహృదమ్ము, శివతాండవహైమవతీవిపంచికా
వాదనమోద మొప్పదె భవత్కవితన్? గురుదేవ! తిక్కనా!

సీ. హరిని, శ్రీచిత్తవిహారిని గొలుచు నే
త్తరదేశతత్త్వమ్ముఁ బరిగణించి
హరుని, గౌరీమనోహరుని సంసేవించు
దక్షిణదేశతత్త్వమ్ము నెంచి
యుభ నవవ్యాసుఁడ వగుట నద్వైతత
త్త్వవ్యాప్తికై దీక్షఁ దగ వహించి
హరిహరనాథబోధామృతం బిడి మహా
భారతమ్మున సమన్వయ మొనర్చి

గీ. భారతపథంబె భారతీపదముగాఁగ
ధృతి నిరూపించినా; వింక నింతకంటె
భారతైక్యమ్మునకు వేఱుదారి గలదె?
స్తుతసుగుణరాజి ! తిక్కనసోమయాజి !

ఉ. వ్యాసుఁడె నీస్వరూపమున వచ్చి తెలుంగున భారతాగమ
శ్రీ నమకూర్చి, జాతి నలరించి, సనాతనధర్మకర్మవి
న్యాసము మీఱఁగా నుపనిషన్మతబోధము నొందజేసె; న
బ్జాసనమూర్తి నిన్నుఁ బరమాచ్యుతకీర్తి నమస్కరించెదన్.

శా. సీతారామపదారవిందయుగళీసేవన్ నిజార్యత్వమున్
దాతన్ బోలె వెలార్చి నీవు సకలాంధ్రవ్రాతచేతోముదం
బో తిక్కన్నమహాకవీ! నిలుపవే యుత్సాహివై సోదర
వ్రాతార్యత్వము నిల్పుటే వ్రతముగా వర్తిల్లు నీ కంజలుల్.

ప్రాచీనాంధ్ర చారిత్రిక భూగోళము-నాడులు

శ్రీ కందూరి ఈశ్వరదత్తు

ప్రోలునాటిలోనిదే యగు కాకాండివాడ (కాకినాడ) కు సమీపమున నున్న సడకుదురు గ్రామమే, సడుపూరు గ్రామమై యుండెనని నాయూహ. (21)

ప్రో లు నా డు

ప్రోలునాడు నేటి తూర్పుగోదావరి మండలములోని పిఠాపురము డివిజను తునిడివిజను కాకినాడ పెద్దాపురము తాలూకాలలోని కొంత భాగమును వ్యాపించియుండెను.

క్రీ. శ. 1024 సంవత్సరమునకు జెందిన వీరచోడుని పిఠాపుర శాసనమున నీక్రింది గ్రామములు ప్రోలినాంటిలోనివని వ్రాయబడెను

---

(21) కాండ్యము శాసనములో మీనుంబాకమునాడు పేర్కొనబడుటచేత, నియ్యది దక్షిణ దేశ ప్రాంతమైనదై యుండునేమోయను సంశయము కలుగవచ్చును. చెంగల్పట్టు జిల్లాలో పాక పాక్కం పదాంతముగల గ్రామములెన్నో కలవు. చెంగల్పట్టు, పొన్నేరి, తిరువళ్లూరు తాలూకాల లోని గ్రామముల నామముల జదివినచో నీ విషయము తేటపడగలదు. 'పాక్కం' సమాసములో "బాకము" గ్రామ నామాంతములలో నున్నది. పాక్కమనగా అరవ భాషలో తీరమని (Board Sea Board) యర్థము. చెన్నపట్టణమునకు దక్షిణదిక్కున సముద్రమునంటి యున్న మండలము అంతటి పెక్కుగ్రామము లీ పేరుతో తెలియుచున్నవి. (A Common affix to places in the sea-board districts, near to, and south of Madras) అట్లే విశాఖపట్టణజిల్లాలో నొక నాగులపాకవాడు గలదు. దీనివిషయము రాబోవు సంచికలో వ్రాయుచున్నాను. కడపమండలములోని పొత్తపినాడు మేర్పాకనాటిలోనిదని యిది తలకెవ్రాసియున్నాడను. రెండు పొత్తపినాళ్ళు శాసనబద్ధములు. గోదావరి మండలములోని పొత్తపినాడు (బొత్తెపివాడు) ఒకటి. కడపమండలములోని దొకటి కాండ్యము శాసనములోని పొత్తపినాడు మొదటిదియా లేక రెండవదియా యనునది క్లిష్టసమస్య)

"ఆలమి, పొన్నతొట్ఱు, మాలవెల్లి, కొల్లిప్రోలు, చేంబ్రోలు, పొలకుం బఱ్ఱు, డంకలపూండి, బెండపూడి, లింగంకొఱ్ఱు, పులావంగుఱ్ఱు, గారపఱ్ఱు, మేడపఱ్ఱు, దారకి, జమ్మిపఱ్ఱు, భీమపూర, కప్పనిపఱ్ఱు, సింగవిక్రమ, దొంటెంగి, నవవాడ, బెండపూండి, దుగ్గవాడ, నాగడ, త్రొప్పిక్కి పూర్వతఃసముద్రః"

పిఠాపురములోని వృథ్వీశ్వరుని శాసనములో ప్రోలునాంటిలోని నవఖండవాడ పేర్కొనబడినది; మల్లపదేవుని శాసనములో ప్రోల్నాటి విషయములోని గుడివాడ యుదాహరింపబడినది. (22)

కాకినాడ తాలూకా సర్పవరగ్రామములో సర్పవరగ్రామము ప్రోలునాటి లోనిదని యాగ్రామమునందలి శ్రీ భావనారాయణస్వామి వారి దేవాలయులో నున్న శాసనముల వల్ల దెలియుచున్నది. (23)

1. గంగ్గగొండచోడవలనాణ్టి ప్రోలునాణ్టి చుత్తమల్లి చతుర్వేది మంగలమున శ్రీ పురుషోత్తమపట్టనము చోడవిణ్ణగరాడ్వారికి...శ్రీభావ నారాయణదేవర......
2. ప్రోలనాంటిలోని సబ్బపురమున శ్రీభావనారాయణ దేవర......
3. గంగగొణ్డచోడవలనాణ్టి ప్రోలునాణ్టి చుత్తమల్లి చతుర్వేదిమంగ్గ లమున శ్రీ పురుషోత్తమదేవర.
4. గంగ్గంగొణ్ణచోడవలనాణ్టి ప్రోలునాణ్టి చుత్తమల్లి చతుర్వేది మంగ్గ లమున శ్రీ పురుషోత్తమమున వీరచోడవిన్నకరాడ్వారికి.

(సర్పవరమునకే శ్రీ పురుషోత్తమ పట్టణమనియు భావనారా యణ పెరుమాళ్లకు పురుషోత్తమదేవర యనియు, దేవాలయమునకు

---

(22) 1. ఎపిగ్రాఫియా ఇండికా సంపుటము 5. పుట 70-74
2. ... ... 4. పుట 32-54
3. ... ... 4. పుట 237

(23) దక్షిణ హిందూదేశశాసన సంపుటము 5. సంఖ్యలు 8, 12, 15, 16, 18

వీరచోడ విన్నగరమనియు పేర్లు. క్షేత్రమునకు పురుషోత్తమక్షేత్ర మని పేరు. విన్నగర మనగా విష్ణుగృహము.)

కాకినాడ తాలూకాలో చాళుక్య భీమవరములోని శాసనము లలో ప్రోలునాంటి "పులిగుంట" కొమ్మరపాంగుపూండి యను గ్రామ ములు తెలుపబడినవి. (24)

రామచంద్రపురము తాలూకా లోని ద్రాక్షారామ శాసన ములలో "బబ్బరవాడ", "కుంకటూరు", "అరియపట్టము" అనుగ్రామ ములు ప్రోలినాంటి లోనివని పేర్కొనబడినవి. (25)

ఆంధ్రచారిత్రిక పరిశోధకమండలివారి పత్రికలో (సంపుటము.5. పుట 33.) ప్రకటింపబడిన రెండవశక్తివర్మ తిమ్మాపురము శాసనములో (శా. శ 983) నుమియవాడయు దానిపొలమేరలైన "చందూరు, "బబ్బరవాడ", "బారసివాడ"యను గ్రామములు ప్రోలినాంటి లోని వని వ్రాయబడెను. ఇందలి "బబ్బరవాడ" ద్రాక్షారామ శాసనములో సహితము పేర్కొన బడినట్లు గమనింపనగును. ద్రాక్షారామ శాసన ములో శ్రీ భీమేశ్వరస్వామి తిరువీథి మఠమునకు గుడ్డవాదినాంటి (కుందూరు, వెల్ల'యను గ్రామములును, ప్రోలునాంటి బబ్బరవాడయు నిబంధము చేసియిచ్చినట్లు వ్రాయబడియున్నది. కుందూరు, వెల్ల, యను గ్రామములు ద్రాక్షారామ సమీపమునసున్న కుందూరు, వెల్ల యను గ్రామములే. బబ్బరవాడయు నట్టిసమీపగ్రామమేదైన నైయుండనోపు. శక్తివర్మశాసనములోని గ్రామములేవో నిర్ణయించుట సాధ్యముగాక యున్నది.

(24) దక్షిణ హిందూదేశ శాసనసంపుటము 5. సంఖ్యలు 82; 90 (శా.శ 1099)

(25) దక్షిణ హిందూదేశ శాసనసంపుటము 4
సంఖ్య 1281............
... 1015 శా. శ 1006
... 1364 శా. శ 1043

మూడవ విష్ణువర్ధనుని ఈపూరు శాసనములో నతడు కొమ్మర వాస్తవ్యుడైన కేశవశర్మకు ప్రోలునాటిలోని జలయూరు గ్రామమును దానము చేసినట్లున్నది. (26)

"కొమ్మరవాస్తవ్యే ఆత్రేయగోత్రాయ హిరణ్యకేశిసూత్రాయ, అగ్నిశర్మణః పౌత్రాయ, శాళిశర్మణః పుత్రాయ, కేశవశర్మణే,ప్రోల్నాండు విషయే జలయూరు నామ గ్రామే పశ్చిమదిశాయాం ఎలియేఱునదీ పశ్చిమతః ప్రభాకరక్షేత్రోత్తరతః కాకండివాడ క్షేత్రపూర్వతో"

ఏ లే రు

ఈనది ప్రోలునాటిలో ప్రవహించుచున్నది. గోదావరి కుత్తరమున రంప, గోలుగొండ,జడ్డంగి మన్యప్రాంతములలో నుద్భవమొంది పెద్దాపురము, పిఠాపురము, కాకినాడ తాలూకాల గుండాప్రవహించి కొన్ని పాయలుగా చీలి, తూర్పుసముద్రమును గలియుచున్నది. ఈ నదీజలములు పెద్దాపురము, పిఠాపురము తాలూకాలలో వ్యవసాయమునకు వినియోగపడుచున్నవి. ఈ ఏరు పొంగి, పొరలి, పైరెంటి తాలూకాలలో దీనిపాయలకును కాల్వలకును వ్యవసాయమునకై తగు జలముల నిచ్చుచుండుటచే, నిది ప్రవహించు ప్రాంతమునకు 'పొర్లునాడ'ని పేరు నయితము గలదు. (27)

ఈ ఏలేరున కనేక ఉపనదులు గలవు. వానిలో కానేరు,మాండేరు భీమనది, మెరకయేరు, అనునవి ముఖ్యములు. సామర్లకోట సమీపము నమున్న చాళుక్య భీమవరమున కుత్తరదిక్కుననను, సామర్లకోటకుసమీపమునను ప్రవహించు నేలేరునకు 'కుమారనది' యని పేరున్నట్లు శ్రీనాథుని భీమేశ్వరపురాణమును బట్టియు, చాళుక్య భీమవరములోని శాసనమువలనను దెలియుచున్నది. శ్రీనాథుడీ ఏలేటి ప్రాంతముల భీమేశ్వరపురాణములో మనోహరముగ వర్ణించినాడు. (సశేషము)

---

(26) ఎపిగ్రాఫియా ఇండికా సంపుటము 18 పుట 58-60

(27) Godavari District Godavari P. 235

మహాశ్వేత

టి. భాస్కరరావు, బి. ఏ., (ఆనర్సు)

ఇరువది యైదు నున్నలు గతించిన కాలము పాలవైచి, యా
గుఱుతులపై నిలంబడి దిగుల్ దిగనాడిన నారికేళపుం
దరు వర విచ్చు పువ్వులు విదల్చి రచించిన రంగవల్లులం
దరుణుఁ డొకండు గాంచె నరుదారెడు కోరిక బారసాఁచఁగా.

ఆ లత లా మహీరుహము లా హిమపర్వత మా తటాకముల్
లీలగ గుర్తువచ్చి మరులెత్తు హృదంతరమందు నిండి ని
శ్వేల శిఖాసమూహ పరిజృంభణ బింబిత నేత్రియుగ్మకే
లాలుఁడు గాంచెఁ గ్రొత్తవలె లాలసతో వెదకాడుకై వశీన్.

అచ్చటి తీఁగజొంపముల యందు మెలంగి మఱింత బాధతో
వెచ్చని యూర్పువుచ్చు; నెఱ విచ్చిన పచ్చని పూలలోని గో
ర్వెచ్చని తేనెలన్ నవదరించెడి తుమ్మెదదిమ్మరీనితో
మచ్చరికించుఁ, గించ పొడమన్ బలవించును దీనదీనుఁడై.

ఇంచుక దూరమందు- హావణించిన తెల్లని వెల్గువోలె భా
సించెడు ధ్యానమూర్తి దరిసించినయంత మనమ్ములోఁ బురా
యించెను భావసంచయము; హెచ్చిన పచ్చి విరాళితో సమీ
పించెను; వెంటవెంట విసిపించెను శ్వేత కెఱింగినట్లుగా.

"రాజముఖీ! సఖీ! ప్రణయ రాజ్యము నేలక యేల యీ పరి
వ్రాజన దారుణక్రియకు భాజనమైతివి, రమ్మ రమ్మ! నీ
రేజముఖీ! సఖీ! వలపు రేకులు విప్పి మరంద మిమ్మ! ని
ర్వ్యాజకృపాప్రపాశ్రితుఁడ; నార్చుట తీర్చుట నీ యధీనముల్!

తీయని రూపుగల్గి వెనుదీయక యిట్లు దురంతదుర్వ్యథా
పాయక తల్పమైన మునిచర్యకు సంకితమిత్తు వేని నీ
ప్రాయము బోలె నామనియు వ్యర్థము లోకమునందు; నాయభి
ప్రాయము నాదరించి యనపాయ ముపాయము నాచరింపవే!

భీతిని మాని దేవి! వెనువెంటనె కీరమువంటి నన్ను నీ
ప్రీతికిఁ దావలంబుగ నభీప్సితపంజరమందు నిల్పుకో!
చేతులఁ జేర్పు మెత్తనల చిక్కదన మ్మనుభోగ్య మానటుల్
చేతము రెక్కలార్ప, ననుసిగ్గులు నిగ్గులు దేలియాడఁగా.

ఓ చిగురాకుఁబోఁడి! భవదుజ్జ్వల లోచన కాంతిలోన నా
పూచిన భావపుష్పములు పోడిమి వీడక మున్నె లేచి ర
మ్మా చిగురాకుబాఁకుదొర కంజలి పట్టి భవిష్యజీవితా
లోచన మాని యాకసములో విహరింతము పక్షిజంటనై.

నాగతి హీనమానసమునం గనుపట్టిన చేతనాకృతీ!
మూగవు వోలె నేల కనుమూయక చూతు పిటుల్ తటస్థవై;
ఆఁగఁగ రాని వేదన మహోర్ధురినై తనలోని కీడ్పుకో
సాగెను నన్ను; గేలొనఁగి సాయమవై కడతేర్పు నేర్పునై."

అనుచు నిరంతరాయముగ నాతఁడు పల్కుచునుండ శ్వేత యా
తని విడనాడి కంపితపదమ్ములతోఁ బువుఁదోఁటపై పుగాఁ
జనినది; స్వేదకంపవివశత్వము లొందిన మేనుతోడ వె
న్వెనుకగ నేఁగి యాతఁ డొక పిలుగఁ జేలము పట్టి లాగినన్.

శ్వేత గిరుక్కునం దిరిగి చేలము పట్టు తెమల్చి చీ యటం
చాతతకోపవేగమున నాతనిఁ జూచి "మదాంధ! ఎట్టి దు
ర్నీతివి! సైచుటెల్ల నవినీతిగ నెంచితె! చిల్కపుట్టువే
జాతకమందు నున్నఁ బడి చావక యేల వృథాప్రలాపముల్."

అని యనినంతలోనె యతఁడాయువు చెల్లి ధరిత్రిఁ ద్రెళ్లె ని
ల్వున నొక పెద్ద మ్రాఁకువలె; లోపలి పాపపుఁ గోర్కె రేగి న
ట్టన పెనుగాలియై పొడ వడంచినదో! పరిశుద్ధచిత్తసం
జనిత వచోరుషానలము శాపము రూపము దాల్చి నొంచెనో!

అవమానమ్మును క్రోధమున్ భయము నేకాకారతన్ ఘోరమై
నవలా సంతతుల చుట్టుముట్టిన దురన్యాయప్రమేయమ్ముతో
నివతాళించెను నశ్రువుల్ కనులదోయిన్ జీకటుల్ నింప, భూ
తవశంబై చనుదానిపోల్కి చనియెన్ దైన్యావధూతాంగియై.

చని చని, వెనువెనుకకుఁ గని
కని, మునుకొనిన మనము గజగజ వడఁకన్
జనవుచు, వసరుచుఁ, దసరఁగఁ
దనువునఁ జెమటలు తటాకతటమున కరిగెన్.

అరిగి, నిటాలమందుఁ గరాంబుజయుగ్మము దోయిలించి, ని
బ్బరమును బూని పల్కినది— "పావనజీవనదేవతా! మనో
హరుఁ డరుదెంచు నంచు నొక యాసకు లొంగితి నిన్నినాళ్లు; నా
కరు దగునట్టి భాగ్యమునకై కయి చాఁపితి; మోసపోయితిన్.
ఇప్పటికీ నిరీక్ష ముగియింతును; నాబ్రతు కిట్లు వ్యర్థమై
ముప్పొఘటింపఁ జొచ్చెఁ; గనుమూయుట కింక ననుజ్ఞ యిమ్ము; నీ
తెప్పలఁ దేలు గర్భమునఁ దీపుల లోపలఁ జోటు చేసి యిం
కెప్పుడు లేవనట్లు కరుణింపుము తల్లి! కృతార్థ నయ్యెదన్."
అని మహాశ్వేత హ్రదములో మునుఁగఁ బోవు
నంతఁ గళవళించిన నీటియడుగు నుండి
సరస మంజుల స్నిగ్ధ సుస్వర మొకండు
వెడలి వలయముల్ చుట్టి విన్పించె నిటులు.

"ఆఁగు చిన్నారి! యిట్టి సాహసము వలదు!
చేతి కందిన వానిని భీతితోడ
జార్చుకొంటి వింతియును నిష్ఫలము గాఁగ;
భయపడకు; నన్ను వినుము; నిశ్చయము కలుగు.
ప్రణయి లోకోపజీవ్యవైభవ మహత్త
త్రిజగతీ దివ్యసిందూర తిలకరేఖ
రాణఁ జెలువొందు మాళవరాజధాని
నిత్యనూతన ముజ్జయినీపురమ్ము.
జలకేళీ లోలాయిత
లలనా కలశీ స్తనోల్లలత్ కస్తూరీ
సలిలాభిషేక నిరతిం
గలాకలాపు నిలువెల్ల గమగమ వొలుచున్.
రవికాంతుల్ - తటినీజలంబుల దివాప్రద్యోతి నక్షత్రముల్,
పువుఁదీఁగల్ గరుడాశ్మవేదికలఁ, గర్పూరాంకురంబుల్ సుధా
ధవళస్ఫాటికమండపిన్, గృతకభూధ్రంబందు నీలంబులున్
భవనాగ్రంబులయందు సుందరవిభాస్వత్సాంధ్యరాగంబులున్.
నగర యువతీధృతాభూషణముల కాంతిఁ
బట్టపగలుగా తద్విభావరుల యందు
సురత దీపకాంతుల కవసరము లేదు-
జక్కవలకు వియోగప్రసక్తి లేదు.
ఆరాజ్యమ్మున కధిపతి
తారాపీడుఁడు; సమస్త ధరణీ నుత దో
స్సారుఁడు; నీతి త్రితయా
ధారుఁడు; కవితాకలాప ధౌరేయుండున్.
అతనికి మంత్రిసత్తముఁడు సాహితిబుద్ధి బలారికిన్ బృహ
స్పతివలె, శుక్రునట్లు వృషపర్వునకున్, దమనాభిధానుసం
గతి నలసార్వభౌమునకు, గాధితనూజునిధాన జానకీ
పతికి సమస్తసద్గుణవిభాస్వరుఁడై శుకనాసుఁ డొప్పెడున్.

ఎల్లవారిజలకు సౌఖ్యముల్ గొల్లవోసి
నందనుం డయ్యె నా శుకనాసమంత్రి;
జీవధనమా మనోరమా దేవి వలనఁ
దనకు లేదయ్యె నందన దర్శనమ్ము.

ఫలరహితమైన కాశపుష్పమ్ము వోలె
వ్యర్థమైపోవు తరుణి యౌవనము గాంచి
అంత రణుఘట్టిత మహాద్రి యట్టు లుండి
యానొకట ఘూర్ణమాన మహార్ణవమ్ము.

ఎన్ని సంపద లుండియు నేమిఫలము ?
మానసపయోధి నానంద మహిత వీచి
కాపరంపరల్ మిన్నంట లేపఁగల్గు
నందన ముఖేందు సందర్శనమ్ము లేక.

మనసులోని బాధ మగువకుఁ దెలుపక
మగఁడు తనకుఁ దానె మథనపడును;
మగువ కూడఁ దాను మనసులో మనసైన
మగనిచెంత దిగులు మాటుపుచ్చు.

భాగవతుఁ డొక్కఁ డీశాన భవనమందు
'సుతులు లేనివారికి లేవు గతు' లటంచుఁ
బల్కు పల్కులు శ్రావ్వాడి ముల్కులౌచు
నాటిన, మనోరమా దేవి బైటపడియె.

దినము దినమెల్లఁ గన్నీట మునిఁగిపోయి
యశనమును నీర మొల్లక యార్త యయ్యె;
పెర్గడయు నామెఁ గనఁగొని బెగ్గడిల్లె
నీశ్వర కృతంబునకు నెదు రేది లేదు.

'దేవి ! ప్రతిపదము మనుష్యజీవితమునఁ
బూర్వజన్మసంచిత కర్మపోషితమ్ము;
ఏడ్పు దక్కుఁగము; చేయ లేదేమొ నాఁడు
పుత్రగాత్ర పరిష్వంగ పుణ్యపూజ!
దైవయోగమ్ము మాన్ప సాధ్యమ్ము కాదు-
కాని, గురు దైవ పూజావిధాన కలన
నిజమనోరథప్రాప్తి సన్నిహిత మౌను;
మానవోచితధర్మ మేమఱుట తగదు.
గర్భమున నవపుండరీకనును దాల్చి
ఉదయమారుతముల మెల్లఁ గదలునట్టి
పూర్ణకాసార మట్లు సొంపులు వెలార్చ
నిన్ను దర్శింపఁగోరి యత్నింతు నేను.
అగ్నివలె లోన దహియించు ననవరతము
పుత్రసంతానకాంక్ష; యీ పుడమి యెల్ల
శూన్యమై సర్వథా పరిశుష్క మౌచు
నారసట్టి వేదనల వెంటాడు నన్ను.
వ్యంగ్యమర్యాద లేని కావ్యము విధాన
నందనుఁడు లేని గృహము మాన్యమ్ము కాదు;
అభ్రగతులైన పితల దాహమ్ము తీర
నేత్రపుటముల నిత్తుఁ గన్నీటిధార.
విధి బలీయము దేవి! నిర్వృతియు లేదు;
వగపు మానుము; ధర్మనిర్వాహమందు
మనసు నిల్పుము; సర్వ కల్మష మడంగి
యమరుఁ గల్యాణశోభ ధర్మాత్ములకును.
చండకౌశికుఁ డను మునీశ్వరుని కరుణఁ
దనయుఁ బడయఁగల్గెను బృహద్రథుఁడు మున్ను;
దశరథావనీవిభుఁడు నందనులఁ గాంచె
ఋష్యశృంగర్షి పుత్త్రికామేష్టివలన.'

అనుచు శుకనాసమంత్రి యూరార్చి, తేర్చి
పలుకసాగె నర్ధాంగితోఁ బలువిధాల;
యామినీదేవి యొడిలోన నఖిల జగము
సర్వకష్టముల్ మఱచి విశ్రాంతి గొనియె.

హంసతూలికా శయ్యాశయానుఁడైన
మంత్రి మూసిన కనులలో మలసె నొక్క
చిత్రదృశ్యము; క్రమ మంజీర రవము
లొలసి వ్యాపించి జగతియంచులు స్పృశించె.

కలశపాథోధి ఫేనపంక్తులు గలంగి
పొంగి పొగ లెగఁజిమ్ముచు నింగి ముట్టె;
అవియుఁ గిమ్మీర వర్ణవాహమ్ము లౌచుఁ
దిరిగి యురుదెంచి కెరటాలఁ గరఁగిపోయె.

ఇంతలో నొక్క కాంతిస్రవంతి తోఁచి
చివర, భద్రసింహాసనాసీనయై మ
నోరమాధ్యానమూర్తి కన్నులకుఁ గట్టె
మొనసి యానందకళలు నర్తనము సలుప.

చంద్రలోకమునుండి స్వచ్ఛందమూర్తి
శ్వేతవెన్నెలల్ జండెముల్ వేసికొన్న
విప్రుఁ డొకఁడు మరంద సుస్మిత పుండ
రీకమును మనోరమకు బహూకరించె.

ప్రకృతి పులకించె; నానంద పారవశ్య
మంది శర్వరీపతి సుధాస్యంది యయ్యె;
వార్ధి నిట్టనిల్వఁ బరవళ్ళు ద్రొక్కె;
గానరవ మొండు రోదోవిలీన మయ్యె.

కనులు విప్పి దెసలు గలయంగఁ దిలకించి
కనినదెల్ల నెఱిఁగి కల యటంచు
భార్యతోడఁ బల్కె— 'భాగ్యమ్ము పండెను
మేలుకొమ్ము: హృదయ మేలుకొమ్ము.
నందనుఁడు గల్గు మనవంశమందు; జీవి
తమున నింక వెన్నెలల దొంతరలు గురియు;
వేల్పులకు సంతసము నింపు కొల్పు లిమ్మ
టంచు మంత్రి స్వప్నకథ భార్యకు వచించె.

ఆశోభావహమైన స్వప్నము నిజంబయ్యెన్; దదీయాస్యవా
యాశావల్లరి పూచినట్టి సుమమై యామోదము న్నింపుచున్
వైశంపాయనుఁ డుద్భవించె; నతఁడే ప్రాయంపుముంపేర్పడన్
నీశాపంబున కగ్గమయ్యె; విధినిర్ణీతంబు నా పేతమా!

ఇంకను దాఁచుటేల వినుమీ! తొలిజన్మములోని పుండరీ
కాంకుఁడె యిట్లు పుట్టెను శశాంకుని శాపముచేత; నేఁడు మీ
నాంకుని టెక్కెము న్విడి బయల్వడినట్టి ఝషమ్ము వోలె ని
ర్వ్యంకలఁ గొట్టుమిట్టగుచు వచ్చెను నీప్రణయప్రవంతికై."
అను పలుకుల్ వినంబడె; ననంతర మాజలముల్ గలంగె; నె
మ్మనమున నుల్లు శేగి దళమై దరులన్ బెకలించునట్టులై
కనులకుఁ జీకటుల్ దెరలు గట్టిన యట్టులుదోఁచి విస్మృతిం
గనినది శ్వేత తత్క్షణమె; కానవ మూనెను నిశ్చలత్వమున్.

తడబాటొందెడు కాళ్లు; కాళ్లకును బందాలైన కుచ్చెళ్లు; దం
దడి గావించెడు డెంద; మందొదవి పంతాలాడు చింతాభరం;
బుడుగన్ రాని భయమ్ము; లెమ్మకొను తీవ్రోద్వేగముం దోడుగా
నడతెంచెన్ జెలికత్తె శ్వేతకడకున్ వ్యాలోల దాలోకయై.

ఇది

శాపము.

రంగనాథరామాయణ కర్తృత్వము

"గాండీవి"

రంగనాథరామాయణకర్తృత్వము వివాదాస్పదములగు గ్రంథకర్తృత్వములలో నొకటి. ఈరామాయణకర్త బుద్ధారెడ్డియని గ్రంథస్థ నిదర్శనమున్నను శ్రీవీరేశలింగముగారు రంగనాథరామాయణకర్త రంగనాథుడే యని తలంచిరి. శ్రీపింగళి లక్ష్మీకాంతముగారు శ్రీకట్టమంచి రామలింగారెడ్డిగారితోపాటు రంగనాథరామాయణకర్త బుద్ధారెడ్డియే యని నిరూపింపయత్నించిరి. శ్రీపింగళివారి వాదమును నిరసించి రంగనాథపక్షమును బునరుద్ధరింపవలెనని శ్రీచాగంటి శేషయ్యగారు శ్రమించిరి. శ్రీపింగళివారి వాదమును శ్రీరెడ్డిగారి వ్రాతలను ఖండించుటకు శ్రీరాళ్లపల్లి యనంతకృష్ణశర్మగారు పడరానిపాటులు పడిరి. రంగనాథపక్షదౌర్బల్యమును బ్రకటించుటకీ నా వ్యాస ముద్దేశింపబడినది.

1. జనశ్రుతి:—

శ్రీశేషయ్యగా రాంధ్రకవితరంగిణిలో నిట్లువ్రాసిరి. "నేనెఱిఁగి యున్నంతవఱకు రంగనాథునిఁ బూర్వకవులలోఁ జేర్చినుతించినవారిలో మొదటివాఁ డనంతామాత్యుఁడు. ఇతఁడు క్రీ. శ. 1400 సంవత్సరప్రాంతమునం దుండెను. రంగనాథరామాయణము 1330 ప్రాంతమున రచితమయ్యెను. అనంతామాత్యుఁడు తనభోజరాజీయమున: "నన్నయభట్టుఁ దిక్కకవినాయకు భాస్కరు రంగనాథు......"అని చెప్పియున్నాఁడు. ఇందు 'భాస్కరు రంగనాథు' అని వరుసక్రమమునఁ జెప్పియుండుటచే భాస్కరరంగనాథరామాయణములను దనమనసునం దుంచుకొని తత్కర్తలనునుతించినాఁడని యెంచఁదగియున్నది. ఆరామాయణము నాతఁడు చదివియుండును. రంగనాథరామాయణ జననమునకుఁ బిమ్మట నరువదిడెబ్బది సంవత్సరములలోనున్న యనంతామాత్యుఁ డొకకల్పితపురుషుని వాస్తవకవిగా నెంచి నుతించె నని తలంచుట కవకాశము లేదు. (4 సంపు. 4 పు) అనంతామాత్యపోతనగోపనాది మహాకవులచే నుతిఁ

గన్న రంగనాథుఁడను కవి యున్నప్పుడా రామాయణ మాతని పేరుతోనే వ్యవహృతమయ్యెననియు దానికతఁడే కర్తయనియుఁ దలంచుట సహజము (6 పు.) దీనినిబట్టి చిరకాలానుగతమైన బహుజనశ్రుతి కూడ నీగ్రంథము రంగనాథుని దని ఋజువుసేయుచున్నది" (7 పు.)

సమాధానము :—

అనంతుఁడు భోజరాజీయమున రంగనాథునొకనిని స్తుతించియుండుట వాస్తవమే. భోజరాజీయరచనాకాలము 1430 ప్రాంతము. "రంగనాథరామాయణరచనాకాలము క్రీ. శ. 1310-1320 నడుమ" (19పు) రెంటికిని వ్యవధానము 110, 120 సంవత్సరములు (1430-1310=120) అనంతుఁడు భోజరాజీయమున "భాస్కరురంగనాథు" అనెనని చెప్పుచు శ్రీశేషయ్యగారు భోజరాజీయరచనాకాలమును స్పృశింపక చల్లఁగా జాఱవిడిచి యనంతుఁడు 1400 ప్రాంతమువాఁడని చెప్పిరి. 1400 ప్రాంతమని గ్రహించినను రంగనాథరామాయణరచనాకాలమునకును ననంతునకును మధ్య 80, 90 సంవత్సరముల యంతరము సంగీకరింపవలసియున్నది. (1400-1310=90) అత్యల్పవ్యవధానము కలదని పాఠకులు భ్రమించుటకుఁగాఁబోలు రంగనాథరామాయణము 1330 ప్రాంతమున రచింపఁబడెనని వివాదస్థలమునం దేన్వవచనవ్యాఘాతమునకుఁ బాల్పడిరి. "రంగనాథరామాయణరచనాకాలము 1320 ప్రాంతము" అని స్థలాంతరములందును (చక్రపాణిరంగనాథుని చరిత్ర) స్పృశించియుండుటచే నిది బుద్ధిపూర్వకముగఁ జేసినమార్పే యని చెప్పవచ్చును.

"భాస్కరురంగనాథు" అనుచోటిరంగనాథుఁడు రంగనాథరామాయణకర్తయే యనుకొనుట భ్రాంతిమూలకము. అధునికులిట్టిచోట్ల వింతవింతలు వ్రాయుచున్నారు "సోముసుభాస్కరుండు వెలయింపన్" అను వసుచరిత్రకారుని కవిస్తుతిలోని భాస్కరుఁ డెఱ్ఱాప్రెగడయేకాని హుళక్కిభాస్కరుఁడు కాదని శ్రీ వేదాల తిరువేంగళాచార్యులుగా రిట్లు వ్రాసినారు. "ఇటభాస్కరుఁడు మనమెఱ్ఱన- అరుణుఁడే కాని భాస్కర

రామాయణకర్త హుళక్కిభాస్కరుఁడు కాఁడు. అతనికి సోమునితోడి సాహచర్యమేది ? హరివంశరచనచే సోమునితో సాహచర్యము మన యురుణునకు, ఎఱ్ఱన కున్నది. కనుక మన యెఱ్ఱనయే యిటభాస్కరుకు-స్ఫురదరుణుడు” అర్థాంతరఘటనమునకై గాని రామభక్తుఁడగుటచే రామాయణమును రచించినాఁ డన్న మెప్పుచేఁగాని రామరాజభూషణుఁడు భాస్కరుని స్తుతించియుండును. సోముని పిదప భాస్కరశబ్దము వచ్చుటచే నయ్యది యెఱ్ఱననే చెప్పుననుటవంటిదే ‘భాస్కరురంగనాథు’ అనుచోటి రంగనాథుఁడు రామాయణకర్తయే కావలెననుట. పూర్వకవులను స్తుతించునపుడు వారి వారిగాలములననుసరించి క్రమముగా స్తుతింపవలయు, సమానేతివృత్తములను స్వీకరించి గ్రంథరచనము చేసినవారి నొక్కచోటనే స్తుతింపవలెననియు, సమకాలికులనుగూడ నట్లే నవ్యవధానముగా స్తుతింపవలెననియు నియమ మేమైనఁ గలదా?

భోజరాజీయకర్త స్తుతించిన రంగనాథుఁడు కల్పితపురుషుఁడు కానంతమాత్రమున రంగనాథరామాయణకర్తయే కాకతీఱ దను నిర్బంధ మేమియు లేదుగదా! అనంతామాత్యునకుఁ బూర్వము చక్రపాణిరంగనాథుఁ డనుకవియుండిన ట్లాంధ్రకవితరంగిణి మూఁడవసంపుటమునందలి యాతనిచరిత్రము బట్టియే తెలియుచున్నది. కావున భోజరాజీయకర్త నుతించిన రంగనాథుఁడు చక్రపాణిరంగనాథుఁడు కావచ్చును. అతఁ డాంధ్రమున శ్రీరంగనాథవిక్రమమును గన్నడమున వీరభద్రవిజయాదులను రచించినవాఁ డని శ్రీశేషయ్యగారే వ్రాసియున్నారు. ఇట్లే పోతనవినుతించిన రంగనాథుఁడు చక్రపాణిరంగనాథుఁడు కావచ్చును. పోతన మొదట శైవుఁడైయుండి వీరభద్రవిజయమును రచించినవాఁడగుటచే నతఁడు చక్రపాణిరంగనాథునే స్తుతించెననుట సంభావ్యమే కాఁగలదు. గోపరాజు తనకులకవిచంద్రులలో నొకనిగాఁ జేర్కొనినరంగనాథుఁడు రామాయణకర్తయేయనుట కాధారము శశవిషాణప్రరోహము. గోపరాజు 1430-90 మధ్యకాలమువాఁడు. రంగనాథరామాయణరచనాకాలమునకును నితనికాలమునకును మధ్యవ్యవధాన మధికముగానుండు

టచే నితఁడు పొరపాటుపడియుండవచ్చును. లేదా చక్రపాణిరంగనాథునే యితఁడును నుద్దేశించియుండెనన్నను క్షతి కానరాదు. గోపరాజు నియోగి బ్రాహ్మణుఁడు. చక్రపాణిరంగనాథుఁడు "నియోగిబ్రాహ్మణుఁడేమో యని సంశయము కలుగుచున్నది" (2 సం. 155 పు.) అను శేషయ్యగారి యూహ నా యీ యభిప్రాయమునే బలపఱుచుచున్నది. కాన ననంతామాత్యపోతనగోపనల స్తుతులు రంగనాథపక్షమును స్థాపింపఁజాలవు.

2. లాక్షణికోదాహృతులు:—

అప్పకవి రంగనాథరామాయణ మనక రంగనాథుని రామాయణమునుండియని లక్ష్యములు ప్రదర్శించుట యీ రామాయణకర్త రంగనాథుఁ డనుటకు నిదర్శనమని యాంధ్రకవితరంగిణిలో వ్రాయఁబడెను. (7పు.) కూచిమంచితిమ్మకవి రంగనాథుని రామాయణమునుండి యన్నట్లు శ్రీ రాళ్ళపల్లి యనంతకృష్ణశర్మగారు వ్రాసిరి.

సమాధానము:—

లాక్షణికులు లక్ష్యలక్షణసంగ్రహపరాయణులే యగుటచేతను వారును సమకాలికులైనఁగాక కేవల మాధునికులగుటచేతను వారివ్రాతలు పరిగణనీయములు కావు. అనంతామాత్యాదుల స్తుతులలోని రంగనాథనామమును రంగనాథరామాయణములోని రంగనాథశబ్దమును భిన్నములని గ్రహింపజాలక భ్రమకలిగి జనశ్రుతి యేర్పడియుండును. దగ్గుపల్లిదుగ్గన సోదరుఁడగు పోతనను బమ్మెరపోతనగా భ్రమించుట ద్వారముననే పోతనశ్రీనాథులు బావమఱఁదు లను జనశ్రుతి యేర్పడినట్లె నిదియును నేర్పడియుండును. జనశ్రుతినిబట్టి యప్పకవియుఁ దదనుగామియై తిమ్మకవియు రంగనాథునిరామాయణ మనియుందురు. ఆంధ్రకవితాపితామహుని యాముక్తమాల్యద నుండి యనుట, "రామరాజవిభూషణరత్నఖచిత, చారుమస్తకలాపపహారి వాక్యగౌరవము పెక్కుభంగుల గణనచేసి" యని యయ్యలరాజు రామభద్రుని స్తుతించుట యప్పకవికి జనశ్రుతిని విశ్వసించు నలవాటు కలదని నిరూపింపఁజాలును.

3. శైలి:—

"పూర్వరామాయణము యొక్కయు నుత్తరరామాయణము యొక్కయు శైలి యొక్కరీతిగ నున్నది. శైలినిబట్టి వివాదమును బరిష్కరించుటలోఁ బ్రమాదము కలుగవచ్చు ననుమాట సత్యమేయైనను నీమాత్రి మన్నితావుల వర్తింపదు. కొన్ని పదములనో కొన్ని పద్యములనో ఆధారముగాఁగొని శైలిని నిర్ణయింపరాదు. కాని యిచ్చటనొక గ్రంథ ముత్తరకాండమున్నది. కావున శైలిపై నాధారపడుట యాక్షేపణీయము కాఁజాలదు. చదివిచూచినప్పుడే రెండుసంపూర్ణగ్రంథముల శైలియు నొక్కటియే యని నిర్ణయించుట కించుకేని సంశయము కలుగదు. కావున నీరామాయణకర్త రంగనాథుఁడని నిశ్చయించుట కభేదమైన యీశైలి బలవత్తరమైన సాక్ష్యమిచ్చుచున్నది" (7 పు.)

సమాధానము:—

పూర్వోత్తరరామాయణములు రెంటికిని రంగనాథుఁడే కర్త యని పైరీతిని శైలినిబట్టి శ్రీశేషయ్యగారు నిర్ణయింపఁ బూనుకొనిరి. రెండురామాయణములశైలియు నేకరీతిగానున్నదనిరేకాని యందుల కుపపత్తులు సెలవీయరైరి. "ప్రమాణ మంతఃకరణ ప్రవృత్తయః) అని తమయంతఃకరణమే ప్రమాణమని తలంచిరేమో ! నిరాధారవాక్యములెంత నొక్కివక్కాణింపఁబడినను బ్రయోజనము శూన్యము.

జనశ్రుతి, లాక్షణికోదాహృతులు, శైలి యను మూడును నితరాధారములు బలవత్తరములై యున్నపుడుమాత్రమే దోహదము చేయునుగాని స్వయంసంపూర్ణతవీనికిలేదు. కావున విస్తరము నావశ్యకము.

హేత్వాభాసము:—

పూర్వరామాయణము రచించునప్పటికే బుద్ధారెడ్డి కవసానము తటస్థించుట మున్నగువిషయములు సంశయాస్పదములగుటచేఁ బూర్వోత్తరరామాయణములు రంగనాథకృతములే యనునది వేఱొకయుక్తికి సారాంశము. (8 పుట.)

సమాధానము:—

గ్రంథనిర్మాణమునుగూర్చి చెప్పఁబడిన కారణము సంశయాస్పదమై నంతమాత్రమునఁ గర్తృత్వమునే తారుమారు చేయఁబోవుట పరిహాసాస్పదము. వీరియావ్రాతనుబట్టి, దానియవసానమును బుద్ధారెడ్డికిఁ దెచ్చిపెట్టిన బుద్ధిమంతుఁడు రంగనాథుఁడని యంగీకరింపవలసి యుండు ననియైనను గమనింపకుండుట శోచనీయము.

5. రంగనాథశబ్దసమన్వయములు :—

రంగనాథరామాయణము రంగనాథకృతమనుటకు మూలకారణము రంగనాథశబ్దము. జనమంచిరామాయణము, వావిలకొలనురామాయణము ననురీతి వ్యవహారము వచ్చినట్లే రంగనాథుడు వ్రాయుటచేతనే రంగనాథరామాయణ మనబడి యది ముఖపత్త్రములపైకెక్కి యుండు ననునది ముఖ్యహేతువనియు జనశ్రుతిమున్నగునవి దీని కుపస్కారములనియు గ్రహింపవలయును.

బుద్ధారెడ్డిపక్షమువారికి రంగనాథశబ్దమును దదనుకూలముగ సమన్వయింపవలసిన బాధ్యత యేర్పడెను. శ్రీపింగళిలక్ష్మీకాంతముగారు విట్ఠలుని పూర్తిపేరు పాండురంగవిట్ఠలనాథుడైయుండవచ్చుననియు నామైక దేశగ్రహణే నామగ్రహణ మను చొప్పున రంగనాథశబ్దమునందుండి తీసి కవిపేరుపెట్టియుండుననియు లేక లేపాక్షి రామాయణమువలె క్షేత్రదైవతపరమైనఁ గావచ్చుననియు నభిప్రాయపడిరి. “బుద్ధభూపతి యీగ్రంథమునకు రంగనాథరామాయణమని పేరుంచెనని ధ్రువపడిననే తప్ప రంగనాథశబ్దమునుండి రంగనాథుఁ డుత్పన్నుఁడయ్యెనని నిశ్చయింపరాదనియు (3 పు.) పాండురంగవిట్ఠలనాథుఁడు పూర్తిపేరనుట కాధారములేదనియు (6 పు) రంగనాథరామాయణమని పిలువఁదలఁచినచోఁ దనతండ్రి నామమునకు రంగనాథశబ్దమునైనఁ జేర్చి సూచించియుండు” (4 పు.) ననియుశ్రీశేషయ్యగారు శ్రీపింగళివారిసమన్వయము నాక్షేపించిరి. విట్ఠల శబ్దముతరువాత ‘నాథ’శబ్దము చేర్చుటకేవీలులేదని శ్రీరాళ్ళపల్లి వారు వ్రాసిరి.

సమాధానము :—

పాండురంగవిట్ఠలనాథుఁడను పేరుగ్రంథాదులలో గన్పట్టుచున్నను మనపూర్వులకుఁ బేరులు గ్రంథస్థముచేయుటలోఁ దగినశ్రద్ధలేకుండుటచే నిదియొక ప్రతిబంధకముకాదు. బట్టుమూర్తి రామరాజ భూషణనామములు, రామలింగ రామకృష్ణనామములుపర్యాయములుగా నేడంగీకరింపబడుచున్నవి. ఈనామాంతరము లాయాకవులు చెప్పికొనియుండలేదు గదా! "ఆకాలమునాఁటి మానవహృదయముల నీకాలమునాఁటి కొలతబద్దతో గొలుచుటకు వీలులేదు" (మంత్రిభాస్కరునిచరిత్ర) అను శేషయ్యగారి సిద్ధాంతమునుబట్టి పాండురంగవిట్ఠలనాథుఁ డను పూర్తిపేరుదాహృతమై తీఱవలెననుటయే నొనఁగదు.

ఇట వేఱొకవిషయమును గమనార్హము. బుద్ధభూపతి తండ్రిపేరు విట్ఠలలక్ష్మీనాథుఁడని పూర్వరామాయణములలో నుండఁగా గన్నారెడ్డియని యుత్తరరామాయణమునఁ గలదు. దీనిని శ్రీశేషయ్యగారిట్లు చర్చించిరి "విట్ఠలభూపతికి గన్నారెడ్డియను నామాంతర మున్నదనియో పినతండ్రిని దండ్రిగావర్ణించినాఁడనియో సమాధానము చెప్పవచ్చును కాని యిది సంశయరాహిత్యమును జేయు సమాధానము కాదు...... పినతండ్రితో సభ్యులు 'నీతనూజన్ముండు' అనిచెప్పుదురా?...పూర్వోత్తరరామాయణములు రెండును రంగనాథుఁడే రచించెనని తలంపఁబడుచున్నదిగదా! అతఁడు రెండుభాగములలోను రెండువిధములుగా వ్రాయునా? ఈప్రశ్నలకుఁ దృప్తికరములైన సమాధానములు రాలేదు. ఉత్తరరామాయణములో "నానొప్పగోనగన్న క్షితీంద్రునకు" అను ద్విపదను "నానొప్పవిట్ఠలనరనాథమణికి" అని సవరింపనైన సవరింపవలయును. లేదా యీద్విపదకును తరువాతిద్విపదకును నడుమ గన్నారెడ్డికిని విఠలనాథునకును గలసంబంధమును దెలుపుచు విఠలునిపేరుదాహరించి మఱిరెండు ద్విపదలనైనను జేర్పవలయును. ఇంతకంటె నీసమన్వయమునకు మార్గాంతరములేదు. భావిపరిశోధనమున నీకఠినసమస్య పూరింపఁబడునేమో చూడవలసియున్నది" (24 పు)

ఈవిఠ్ఠలగన్నారెడ్డినామముల వైరుధ్యము రంగనాథరామాయణకర్తకుఁ బేరులు పేర్కొనుటలోని యుపేక్షాభావమునకుఁ దార్కాణమగుచున్నది. కావున నతఁడు పాండురంగవిఠ్ఠలనాథుఁడనిగాని రంగనాథరామాయణమనికాని గ్రంథస్థము చేయకుండుట తత్స్వభావానుగుణమేకదా!

'సీతనూజన్ముండు' అనుచోట "తనూజన్మ" శబ్దము రూఢ్యర్థమునసే ప్రయుక్తమై యుండును. కాదేని "నానొప్పుగోనగన్న శ్రీతిండుని వకు...తనయుండు...బుద్ధభూవిభుఁడు" అని చెప్పఁబడుటచే విఠ్ఠలునకు బుద్ధారెడ్డి యౌరసుఁడనియు గన్నయకు దత్తుఁడనియు నిర్ణయించుటలెస్స. తనూజన్మశబ్దమునకు వ్యుత్పత్త్యర్థము నెన్నునపుడు తనయశబ్దమునకును వ్యుత్పత్తినెన్నుట యుచితమేకదా! "తనయః. పుం. తనోతి విస్తారయతి కులమితి 1 తన + "వలిమలితనిభ్యఃకయన్" ఉణా 1 ఇతి కయన్ 1 పుత్రః 1 ఇత్యమరః" అని శబ్దకల్పద్రుమకోశము. కులవిస్తరణమునకేకదా దత్తునిఁ గైకొనుట.

'నానొప్పువిఠ్ఠలవరనాథమణికి' అని సవరింపవలెననుట, విఠ్ఠలుని పేరుదాహరించి రెండుద్విపదలనైనఁ జేర్పవలెననుట శ్రీశేషయ్యగారి యౌదార్యమునకుఁ దార్కాణము. ఈపక్షమున రంగనాథరామాయణనామమును బాండురంగవిఠ్ఠలనాథనామమును గలద్విపదలే చేర్చుట కంగీకరించినచో వారియౌదార్యము ద్విగుణీకృతమగును.

స్థలాంతరములందలి శ్రీశేషయ్యగారి నిర్ణయములను, నిరాధారపుటూహలను, గమనించితిమేని పరిష్కృతవాదమునందలి సారహీనత మఱికొంత ప్రస్ఫుటమగునని దిఙ్మాత్రముగా నుదాహరించుచున్నాను. పాల్కురికి సోమనాథుఁడు బ్రాహ్మణుఁడని యిట్లు నిర్ణయించినారు. "పైనవ్రాసిన వాక్యములనుబట్టి సోమనాథుఁడు జంగమేతరుఁడనియే తేలుచున్నది. కాని యాతఁడు బ్రాహ్మణుఁడని తలంచుటెట్లు? అని యడుగవచ్చును. సోమనాథుఁడు బ్రాహ్మణుఁడా జంగముఁడా యనియే

యిదివరకున్న వివాదము. మఱియొకకులమువాఁడా? యను ప్రశ్న లేదు. జంగముఁడు కానియెడల నాతఁడు బ్రాహ్మణుఁడే యగును." ఇట్లే భాస్కరరామాయణకర్తృత్వనిర్ణయమున నొకహేత్వాభాసముతో నరణ్యకాండకర్త హుళక్కిభాస్కరుఁడు కాఁడని చెప్పి మంత్రిభాస్కరుఁడే తత్కర్తయనియు నిరువురిలో నెవరన్నదే ప్రశ్నముకాన నతఁడు కానిచో నితఁడేయనియు వ్రాసినారు. ఇట్టివీరే చింతామణి కర్తృత్వమునుగూర్చిన చర్చలో వ్రాసినవాక్యరత్నములు చూడుఁడు. "శ్రీశాస్త్రిలవారు తమపరిశోధనముఁ జింతామణిసూత్రములను బాలసరస్వతి రచియింపలేదని చూపుటకై యనేకవాక్యములను వ్రాసియున్నారు. మనకుఁ గావలసినది చింతామణి నన్నయకృతమగునా? కాదా యనుప్రశ్న కుత్తరముగాని బాలసరస్వతి రచించెనా లేదా యనుప్రశ్న కుత్తరముఁ గాదు. చింతామణికర్త బాలసరస్వతి కాకపోయిన నాతనితాత మఱియొకఁడు కావచ్చును. ఆగ్రంథకర్త బాలసరస్వతి కాడనినంతమాత్రమున నన్నయకర్తృత్వము స్థిరపడదు." (3 సం. 49 పు) ఈవాదమును జూడఁగా నీవుకానిచో నీతల్లి తిట్టియుండునను తోడేలుగొఱ్ఱెపిల్ల కథ స్మరణాతిథి యగుచున్నది. నన్నయకర్తృత్వవాదఖండన మెట్లున్నను బాలసరస్వతి కానపుఁడు చింతామణి నన్నయభారతభాగముల యాంతరంగికసంబంధాదులు నన్నయకర్తృత్వమునుస్థాపించుచుండఁగా స్వవాదస్థిరకరణాభినివేశముతో జల్పమునకు దిగినారు.

"ఎత్తత్తినైనను" అను నిర్వచనోత్తరరామాయణపద్యములలోని గూఢార్థముల నూహించినవారును, నిరాధారపుటూహలతో సంక్షేపరామాయణమును సృష్టించి భాస్కరరామాయణకర్తలపై గ్రంథచౌర్యదోషము నారోపించినవారును నగు నాంధ్రకవితరంగిణీకర్తగారికిఁ బాండురంగబిట్టలనాథుఁ డనుపేరు నూహించిన శ్రీపింగళివారి సంభావన మెట్లునుచితమయ్యెనో తెలియకున్నది. భాస్కరరంగనాథు అను కవిస్తుతిలోని రంగనాథుఁడు రంగనాథరామాయణకర్తయె యను తమయూహ శిరోధార్యమును విట్టలనామమునుండి పాండురంగబిట్టలనాథుఁడను పేరునూ

హించుట యసంబద్ధమును నగునా? తమయూహ లెట్టివైన ప్రమాణాంతరము లక్కరలేదుగాని పాండురంగవిట్టలనాథుఁడను పూర్తి పేరునకు మాత్రము గ్రంథస్థప్రమాణమో శాసనాధారమో యుండతీరవలయునా? విట్టలుపూర్తి పేరు పాండురంగవిట్టలనాథుఁడై యుండవచ్చుననునూహకు ప్రతిబంధకముగా శ్రీ రాళ్ళపల్లి వారిట్లు వ్రాసిరి "విట్టలశబ్దమె విష్ణుశబ్దభవము. దానికి నాథపదము చేర్పనక్కరలేదు. ఒకవేళ చేర్పవచ్చినను కొడుకు తండ్రిని విఠ్ఠలధరణీశుఁడు విట్టలక్ష్మాపాలుఁడు ఇత్యాదిగానే వ్యవహరించి నాడుగాని విటలనాథనామధేయము చూపలేదు"

విట్టలశబ్దము విష్ణుశబ్దభవమన్నచోఁ బాండురంగవిట్టలుఁడనునది వైరపదమగును. కావునఁ బాండువిట్టలుడనుటయే పొసఁగదని శ్రీ రాళ్ళపల్లి వారేల వాదింపలేదో? "అప్పచ్చవిత్తి కన్నతండ్రిఁ పాండురంగవిఠ్ఠలున్" (పాండు 5-197) అను తెనాలిరామకృష్ణుని ప్రయోగముండుటచేఁ పాండురంగవిట్టలుఁ డనునది యంగీకరింపక తీఱదు. "దినవెచ్చము" అను వైరిపదము ప్రయోగించిన రామకృష్ణుడు విష్ణుశబ్దభవమగు విఠ్ఠలశబ్దముతో వైరిపదము నిటుఁగూడ వాడెననియో లేక "సనామ్ని వ్యుత్పత్తిః" అను చొప్పున వ్యుత్పత్తి నెన్ననక్కఱలేదనియో సమాధానపడవలెను. 'విఠ్ఠల' శబ్దము తద్భవమనినచో సనాంధ్రవర్ణమగు ఠకారస్థితిని నిర్వహించు ప్రాసాదిగతిప్రయోగము లేమింజేసి 'విఠ్ఠలున్' అని గ్రహించవలసియుండును విట్టశబ్దము తద్భవమైనను బాండురంగవిఠ్ఠలుడనియో, పాండురంగవిట్టలుడనియో యనవచ్చును "భవేద్బిరుద శబ్దేషు యథేచ్ఛం వర్ణకల్పనా, గ్రామ మానవ్యబిరుద శబ్దానామపి సోమతిః" అను నథర్వణకారికలచే దీని సాధుత్వము శంకాస్పదము కాదు. విష్ణుశబ్దభవము 'విఠ్ఠల' యని ప్రామాణికు లెవ్వరును జెప్పియుండలేదు. శబ్దార్థచింతామణ్యాదిసంస్కృతకోశములలో నీశబ్దముకలదేమో యరయవలసియున్నది. సంస్కృతకోశములో సంజ్ఞావాచకమగుటచే విఠ్ఠలశబ్దము పేక్షితమును గావచ్చును. కైవార హేరాళాదిశబ్దములు సంస్కృతకోశములందు లేకపోయినను సంస్కృత

పదములేయని ప్రామాణికుల యాశయము. 'పాండురంగవిట్ఠలుఁ'అను రామకృష్ణుని ప్రయోగమునుబట్టి 'విట్ఠల'.శబ్దము సంస్కృతమగుననియుఁ దలంపవచ్చును. ఇంతకును విట్ఠలశబ్దముపై నాథశబ్దము చేర్చనగునా ? యన్నది ప్రకృతము. "సనామ్ని వ్యుత్పత్తిః'' అను చొప్పునఁ జేర్చినను క్షతిలేదని చెప్పఁదగును. ఇంతియకాక "విట్ఠలాధీశుఁ దలఁచి తద్విపుల మహిమ" (పాండు 1-213) అను తెనాలిరామకృష్ణుని పద్యపాదమునందలి విట్ఠలాధీశుననుదానివలెనే విట్ఠలనాథుఁడనునదియు సమంజసమే యగుచున్నది. "...దేవనాథస్వామిన్...ప్రభృతిపూజ్యతావాచకములును ప్రశంసావాచకములే యగునని కొందఱమతము. కొందఱు సంభావనాపూర్వపదకర్మధారయమందురు" అని శ్రీసన్నిధానము సూర్యనారాయణశాస్త్రిగారు తత్సమచంద్రికలో (348 పు.) వ్రాసి రామనాథుఁడని యుదాహరించిరి. "సద్వితీయుఁడు రామనాథుఁడే కర్త" (బసవ 182పు.) అని పాల్కురికిసోమనాథుఁడు ప్రయోగించియున్నాఁడు. (అద్వితీయుఁడు రామనాథుఁడేకర్త) అను యతిభ్రంశముతోడి పాఠము సంస్కర్తృప్రమాదకృతము. "సహార్థక సశబ్దము ద్వితీయశబ్దముతో 'సుప్సుపా' అను చొప్పున సమసించెననఁదగును" శ్రీవజ్ఝల. "సఞోన్య నాజ్ఞసా" అను ముగ్ధబోధసూత్రమునొద్ద 'అనన్తః, నాన్తః, అచ్యుతః, సచ్యుతః'అని యుదాహరణములు చూపఁబడెను. గీ. 'సద్వితీయుంబుగా దీవి నలువచేయఁదలఁచి' అని వరాహపురాణమునఁ సద్వితీయశబ్దము ప్రయుక్తమై యున్నది.

రామనాథశబ్దమునందలి పూజ్యతావాచకమగు నాథశబ్దము కొందఱమతమునఁ బ్రశంసావాచకమును గొందఱమతమున సంభావనాపూర్వపదకర్మధారయమునునై గ్రాహ్యమైనట్లే విట్ఠలశబ్దము మీఁది నాథశబ్దమును గ్రాహ్యము కాఁజాలును.

విట్ఠలుని పూర్తిపేరు పాండురంగవిట్ఠలనాథుఁడై యుండవచ్చుననియుఁ బూర్తిపేరుదాహృతము కాకుండుటకు రంగనాథరామాయణమని గ్రంథస్థము కాకుండుటకు నాఁటివారియుపేక్షయే కారణమనియు

విఠ్ఠలగన్నారెడ్డినామముల వైరుధ్యము రంగనాథరామాయణ కర్త యిట్టియుపేక్షాపడుడనుటకు నిదర్శనమనియు నాయీవ్యాసమునకు సారాంశము. రంగనాథశబ్దము క్షేత్రదైవతపరమని యంగీకరించినను బుద్ధారెడ్డిపక్షమున కనుకూలమే యగును.

బుద్ధారెడ్డి రంగనాథకృతమగు రామాయణమును నిజకర్తృకముగాఁ బ్రకటించుకొనుట యధర్మము కాదనియు నందుచే నతఁడట్లు ప్రకటించుకొనియుండుననియు శ్రీరాళ్ళపల్లి వారు వ్రాసి కొన్ని యుక్తులు ప్రదర్శించిరి. బుద్ధారెడ్డి దుర్గము నిర్మించెననురీతి వ్యవహారమునకుఁ గావ్యము రచించెనను వ్యవహారమునకుఁ గలభేదము వారు గుర్తింపలేదు. ఇటుకలు సున్నము మున్నగునవి తానే మోసికొనిపోయి స్వయముగా బుద్ధారెడ్డి దుర్గము నిర్మింపకపోయినను నతఁడు దుర్గము నిర్మించెనని వ్యవహృతి యైనట్లే యతఁడు స్వయముగాఁ గావ్యము వ్రాయకపోయినను వ్రాసెననుట సముచితమే యని వారి యభిప్రాయము. బుద్ధారెడ్డి దుర్గము నిర్మించెననఁగా దుర్గనిర్మాణకారకుఁడు బుద్ధారెడ్డి యనియు' నది యతని ప్రభుత్వకాలమున జరిగెననియు భావము. బుద్ధారెడ్డి కావ్యము రచించె ననఁగా నతఁడు స్వయముగా దానిని నిర్మించెనని భావము. అంతేకాని యితరుని కావ్యమును దనదిగాఁ బ్రకటించుకొనెనను భావ మందు లేదు. కార్యప్రేరకునకును గార్యకర్తకును భేదము గమనింపక యేమేమో వ్రాసినారు. సూక్ష్మముగా నాలోచించియుందురేని యిట్లు వ్రాసియుండరేమో! అపరిశీలనకృతములగు వ్రాఁతలు పలుచోట్ల వారి వ్యాసములందుఁ గననగును. అవి విమర్శనసహములుగా గన్పట్టవు.

రంగనాథపక్షమునఁ జూపఁబడిన యుక్తులకు నాదోఁచినకొలంది సమాధానము లొసఁగితిని. రంగనాథపక్షమువారి వాదము దుర్బలముగా నున్న దని నా యభిప్రాయము. విజ్ఞు లుచితతరమైనదానిని గ్రహింతురు.

[గతిసంచికతరువాయి]

నారికేళము

శ్లో. భో నారికేళ ! తవ మస్తకభేదకానాం
సాధ్యం భవే త్తవ జలం కఠినస్వరూప !
నాహం త్వదీయసలిలగ్రహణే సమర్థ
స్త్వత్యంతఖేదవిముఖ శ్శుకరాజబాలః.

తే. గీ. నారికేళ ! మహాకఠినస్వరూప !
వారి నీతలఁ గొట్టెడివారి కబ్బుఁ
గాని నాకెట్లు? కొనఁ జేతకానివాఁడ
ఖేదవిముఖుఁడ వరరాజకీరసుతుఁడ.

చందనము

శ్లో. మూలం భుజంగై శ్శిఖరం విహంగై
శ్శాఖాః ప్లవంగైః కుసుమాని భృంగైః.
పార్శ్వం మతంగైః కరణం కురంగై
స్సంసేవ్యతే చందనపాదపోఽయమ్.

తే. గీ. భృంగములు ప్లవంగములు విహంగములు భు
జంగములు కురంగములు మతంగములును
బువ్వులం గొమ్మలం దుదిన్ మొదలఁ గరణ
మందుఁ బ్రక్కల సేవించుఁ జందనమును.

శ్లో. పాటీర ! తవ పాటీయాన్
కః పరిపాటీ మిమా మురీకర్తుం
య శ్పింషతా మపి నృణాం
పిష్టోఽపి తనోషి పరిమళైః పుష్టిమ్.

తే. గీ. బళిర ! పాటీర ! నీపరిపాటి నెల్ల
ఎట్టిపాటియుఁడును వచియింపఁగలఁడె?
జాతిపైఁ బెట్టి రాయువారలకె నీవు
పరిమళంబులచేఁ బుష్టిఁ బరిఢవింతు.

శ్లో. జనక స్సానువిశేషో
జాతిః కాష్ఠం భుజంగమై స్సంగః
స్వగుణై రేవ పటీరజ !
యాతో ఽసి తథాపి మహిమానమ్.

ఆ. వె. జనన మెంచి చూడ సానువలో ; జాతి
కాష్ఠమే, భుజంగగణముతోడ
సంగమంబు నీకుఁ జందనమా ! నైన
గుణవిశేషకలనఁ గాంచు-మహిమ.

శ్లో. అయి మలయజ ! మహిమాయం
కస్య గిరా మస్తు తే విషయః
ఉద్గిరతో యద్గరలం
ఫణినః పుష్ణాతి పరిమళోద్గారైః.

ఆ. వె. పరిమళములచేతఁ బరిపోషణ మొనర్తు
గరళములను గ్రక్కు నురగములను
మలయజా! త్వదీయమహిమను వర్ణింపఁ
గలనె? యొక్క-పలుకుఁ గలదె పలుక ?.

శ్లో. సౌరభ్యం భువనత్రయేఽపి విదితం శైత్యం చ లోకోత్తరం
కీర్తిః కిం చ దిగంగనాంగణగతా కిం త్వేత దేకం శృణు
సర్వా నేవ గుణా నియం నిగిరతి శ్రీఖండ ! తే సుందరా
నుజ్ఝంతి ఖలు కోటరేషు గరళజ్వాలాం ద్విజిహ్వావళిః.

శా. సౌరభ్యంబు జగత్త్రయీవిదిత మౌ; శైత్యంబు లోకోత్తరం
బై రాజిల్లు, దిగంగనాంగణగతం బై కీర్తి యేపారు, పా
టీరా! కోటరకోటిలో గరళధాటిం జూపుచు న్నీగుణో
ద్గారంబు న్నిరసించుచుంటఁ గనఁబోవా! తద్ద్విజిహ్వావళిన్.

శ్లో. లోకానందనచందనద్రుమ! సఖే! నాస్మిన్ వనే స్థీయతాం
దుర్వంశైః పరుషై రసారహృదయై రాక్రాంత మేతద్వనం
తే ష్వన్యోన్యనిఘర్షజాతదహనజ్వాలావళీసంకులా
న స్వాన్యేవ కులాని కేవల మహో సర్వం దహేయు ర్వనమ్.

శా. ఏరా! చారుపటీర! యీవనమునం దీవుండఁగాఁబోకు ని
స్సారంబుల్ పరుషంబు లౌ నధమవంశస్తోమ మీసీమ నో
ప్పారుం జాల పరస్పరాకషణకువ్యత్యుల్లికీలావళుల్
ఘోరప్రక్రియఁ గాల్చు తత్కులముతోఁ గూడన్ సమస్తాటవిన్

శ్లో. ఆమోదై స్తే దిశి దిశి గతై ర్దూర మాకృష్యమాణా
స్సాక్షాల్లక్ష్మీం తవ మలయజ! ద్రష్టు మభ్యాగతా స్స్మః
కిం పశ్యామ స్సుభగ! భవతః క్రీడతి క్రోడ ఏవ
వ్యాళ స్తస్మా ద్భవతు కుశలం ముంచ న స్సాధు యామః.

మ. హరిదంతంబులనల్లుకొన్న భవదీయామోదభారంబుచేఁ
గర మాకృష్టులమై త్వదీయఘనసాక్షాల్లక్ష్మి వీక్షింప రా
నురగిం గంటిమి కోటరోదరమునం దో చందనా! చాలు మే
మరుగంగా సెలవిమ్ము; నీకును శుభం బౌఁగాత నీ కెంతయున్.

శ్లో. భ్రాత శ్చందన! కిం బ్రవీమి విటపన్యస్తోత్ఫణాభీషణాః
గంధస్యాపి మహావిషాః ఫణభృతో గుప్త్యై య దేతే కృతాః
దై వా త్పుష్పఫలాన్వితో యది భవా నత్రాభవిష్య త్తదా
నో జానే కి మకల్పయిష్య దధికం రక్షార్థ మస్యాత్మభూః.

చ. పరిమళమాత్రరక్షలకె వారిజయోని ఘటించినాఁడు శ్రీ
కరగరళోద్గిరత్ఫణినికాయములన్ భవదీయశాఖలం
దరుదుగ దైవయోగమున నబ్బిన పుష్పఫలాభిరక్షకై
కర మధికం బిఁకేమి పరికల్పన సేయునొ! చందనద్రుమా!

శ్లో. వహతి విషధరా నృటీరవృక్ష
శ్శిరసి మషీపటలం దధాతి దీపః
విధు రపి దధతే తథా కలంకం
పిశునజనం ఖలు బిభ్రతి క్షితీంద్రాః.

తే. గీ. క్రూరఫణులను దాల్చుఁ బటీరతరువు
పైని మసిని వహించు దీపవ్రజంబు
కాంచు నజహాత్కలంకంబు కమలవైరి
పిశునజనుల భరించుఁ బృథ్వీధవుండు.

శ్లో. నైర్గుణ్య మేవ సాధీయో
ధి గస్తు గుణగౌరవం
శాఖినోఽన్యే విరాజంతే
ఖండ్యంతే చందనద్రుమాః.

తే. గీ. ఇతరధరణీరుహంబు లీయిలను వెలయు
నిస్తులపటీరతరువె ఖండింపఁబడును
గాన నపకారి యగుగుణగౌరవం బ
దేల పో నిర్గుణత్వమే చాల మేలు.

శ్లో. పరిభిత ఏవ మిథఃకృతశృంఖలై
ర్విషధరై రత ఏవ మహీజడః
మలయజ స్సుమనోభి రనాశ్రితో
య దత ఏవ ఫలేన న యుజ్యతే.

తే. గీ. ఎనసి రెండొంటఁ బెనఁగొని చుట్టుకొనిన ఫణుల
వదన మగుటఁ బటీరమ్ము జడమె యగును
తాను సుమనస్సదాస్రితమ్ము గాన
ఫలరహిత నూచు వఱలు విశ్వమ్మునందు.

శ్లో. యై స్త్వం గుణగణవా నపి
సతాం ద్విజిహ్వై రసేవ్యతాం నీతః
తా నపి వహసి పటీరజ!
కిం కథయామ స్త్వదీయ మాహాత్మ్యమ్.

తే. గీ. విశ్వసత్త్వాళి నిన్ను సేవింపకుండ
గండుకొనుచుండు రెండునాల్కలభుజంగ
సంఘముం గూడఁ గూడెదో చందనంబ!
నిత్యనిత్యము తావకౌన్నత్యగరిమ.

చంపకము

శ్లో. సకలగుణనిధానం మాం విహాయ ద్విరేఫాః
పరిమళపరిహీనం హ న్త చుంబంతి ధూ ర్తం
ఇతి మనసి విషాదం మా కృథా శ్చంపకో ఽత్ర
రిహ మధుపసమాజే కో వివేకావకాశః.

తే. గీ. సర్వగుణగణగణనీయు నన్ను విడిచి
వాసనాహీను ధూర్తుఁ జుంబన మొనర్చె
నళు లనుచు జంపకా! మనమందుఁ జింత
వలదు; మధుపాళికి వివేకభావ మున్నె?

శ్లో. య న్నాదృత స్త్వ మళినా మలినాశయేన
కిం తేన చంపక! విషాద మురీకరోషి.
విశ్వాభిరామనవనీరదనీలవేషాః
కేశాః కుశేశయదృశాం కుశలీభవంతు.

చ. మలినతమాశయంబుఁ గలమాధుకరావళి సేవగించి నన్
జాలకననేసె నంచుఁ గడు బ్రోలి విచారము నందనేటికిన్
జలజవిలోచనాజలదజాలవినీలజగన్మనోజ్ఞకుం
తలము లవెంతయుం గుశలతం గనుత న్నిరతంబుఁ జంపకా !

కీ చ క ము

శ్లో. మలయాచలసంసర్గా
న్న వేణు శ్చందనాయతే
అంతస్సారవిహీనానాం
రసః కే నోపజాయతే.

తే. గీ. మలయభూధరసాంగత్యకలనవలన
వంశ మెన్నఁడు చందనత్వంబుఁ గనదు
సారమే లోన లేనట్టి వారలకును
ఎవ్వఁ డేరీతి రస ముదయింపఁ జేయు.

ఉ శీ ర ము

శ్లో. ఉత్తుంగై స్తరుభిః కి మేభి రఫలై రాకాశసంస్పర్ధిభిః
ధన్యోఽసౌ నితరా ముశీరవిటపీ నద్యా స్తటే తిష్ఠతి
ఏవం యః కృతబుద్ధి రుద్ధతతరాత్ వ్యాలోలవీచీవశాత్
మజ్జంతం జన ముద్ధరామి సహసా తేనైవ మజ్జా మ్యహమ్.

మ. ఉపయోగం బణుమాత్రమేని గలదే యుత్తుంగతం గల్గి వ్యో
మపరిస్పర్ధ నెసంగుచుండినకుజన్మవ్రాతముల్ మేటిలన్
"కృపతో భంగనిమగ్నమాను వడి నెంతే మున్గియుం దేల్తు నే
న పర" మ్మంచు నుశీర మెంచు నదిచెంతన్ ధన్య తా నెంతయున్.

క ద ళి

శ్లో. కిం కేతకీ ఫలతి కిం పనస స్తు పుష్పం
కిం నాగవల్లి రిహ పుష్పఫలే ప్రసూతే
కస్యాపి కోఽప్యతిశయోఽస్తి న తేన సద్భి
స్సంపూజ్యతే కదళి! యాసి తత ప్రసిద్ధిమ్.

తే. గీ. పనస పుష్పించునే? నాగవల్లి పుష్ప
ఫలము లీనునె? కేతకి ఫలిత మగునె?
అందోకండ్లైన సంపూజ్య మై యెసఁగునె?
యన్నిఁటఁ బ్రసిద్ధి నీయదే యగును గదళి!

ధు త్తూ ర ము

శ్లో. ధుత్తూర! ధూర్త! తరుణేందునివాసయోగ్య
స్థానే పిశాచపతినా వినివేశితోఽసి
కిం కైరవాణి వికసంతి తమః ప్రయాతి
చంద్రోపల స్స్రవతి వార్ధి రుపైతి వృద్ధిమ్.

తే. గీ. ధూర్తధుత్తూర! భూతనాథుండు నిన్ను
శీతకరపోతవాసార్హసీమ నిడినఁ
గలువ వికసించునే? వార్ధి గనునె వృద్ధి?
తమము వాయునె? చంద్రకాంతము గరఁగునె ?

శ్లో. రే రే ధుత్తూర! భిత్తేః పరిముదితహృదః క్వాపి కోణే జనిత్వా
ప్రాప్యాభిఖ్యాం తదాఖ్యాం కనక మితి పునః కాంచనస్యాపిలోకే
మందం మందం స్మరారే ర్మణిమకుటతటే తత్ర లబ్ధావకాశం
నో జానీషే కలేశం స్మరసి చ న పునః పూర్వవృత్తాంతలేశమ్.

మ. జననం బందితి కుడ్యకోణమున విశ్వంబందు పేరందుచుఁ
గనకం బంచును గాంచనం బనుచు, విఖ్యాతిం గొనన్ మెల్లమె
ల్లనఁ గామారిమణీకిరీటతటి హేలావైఖరిం జేరి ప్రా
క్తనవృత్తాంతము నెంచ, విందు నరయంగాఁబోవు ధుత్తూరమా!

బూ రు గు

శ్లో. విశాలం శాల్మల్యా నయనసుభగం వీక్ష్య కుసుమం
శుక స్యాసీ ద్బుద్ధిః ఫల మపి భవే దస్య సదృశం
ఇతి ధ్యాయ న్నాస్తే ఫల మపి చ దైవా త్పరిణతం
విపాకే తూలోఽంత స్సపది మరుతా సోఽప్యపహృతః.

చ. కనులకుఁ బండువై విరివిగా సలరారెడు శాల్మలీసుమం
బును గని "దీని కింత యగుఁ బో ఫల''మంచు శుకంబు వేచియుం
డినతఱి దైవయోగమున నిస్తుల మాఫలమై విపాకముం
గొనుటయు హా! సమీరణము గొంచుఁ జనెన్ ఫలమధ్యతూలమున్.

శ్లో. కీరాః పక్వఫలాశయా మధులిహః స్సౌరభ్యలాభాశయా
హంసాః పద్మవనాశయా బలిభుజో గృధ్రాశ్చ మాంసాశయా
దూరా దున్నతపుష్పభారనిచయభ్రాంత్యా సమాకర్షితా
శ్రే రే శాల్మలిపాదప! ప్రతిదినం కో న త్వయా వంచితః.

ఉ. సౌరభలాభలోభమున షట్పదముల్, శుకముల్ ఫలాశలన్
సారసబుద్ధి హంసములు, సారతరామిషశంక గృధ్రముల్
కారటముల్, త్వదీయగుణకాండముఁ గాంచి భ్రమించి వచ్చె; నె
వ్వారల శాల్మలీ! సతము వంచనసేయుట మానితీ వినీ!

మాలతీలత

శ్లో. గుంజతి మంజు మిళిందే
మా మాలతి? మౌన ముపయాసీః
శిరసా వదాన్యగురవః
సాదర మేనం వహంతి సురతరవః.

తే. గీ. పుంజికొన నళిమంజులగుంజితాళి
మాలతీ! చాల యీలీల మౌన మేల?
ఎఱుఁగవో వీని దాతృశేఖరు లుదార
సౌరతరువరులున్ శిరసావహింతురు.

అశోకము

శ్లో. గర్వాయసే వికచకోరకపుంజగుంజ
దుద్వృత్తషట్పదభవా విభవేన కిం ను
వామభ్రువాం చరణతాడనదోహదాని
కిం నామ న స్మరసి తావ దశోక! తాని.

చ. గరువముఁ జెందుచుంటివె వికస్వరభాస్వరకోరకవ్రజ
ద్వరతరచంచరీకచయుపై భవముం గలవాఁడ నంచహా!
మఱచితివా? యశోకకుజమా! హృదయంబున నింతలోననే
తరళమృగేక్షణాచరణతాడనకల్పితదోహదక్రియల్.

శ్లో. పత్రైఃఫలపుష్పలక్ష్మ్యా
కదా ప్యదృష్టం వృతం చ ఖలు శూకైః
ఉపసర్పేమ భవంతం
బర్బుర! వద కస్య లోభేన.

తే. గీ. ఒక్కమంజులదళ మైన, నొక్కమధుర
ఫల మయిన, నొక్కసురభిళలలితకుసుమ
మైన నెన్నఁడు దులే; శూకాళ్రియుఁడవు,
బర్బురా! నిన్నుఁ జేరినఫల మదేమి?

లవంగలత

శ్లో. లూనం మత్తగజైః కియ త్కియ దపి ఛిన్నం తుషారార్దితైః
శిష్టం గ్రీష్మజభీష్మభానుకిరణై ర్భస్మీకృతం కాననం
ఏషా కోణగతా ముహుః పరిమళై రామోదయన్తీ దిశో
హా! కష్టం లలితా లవంగలతికా దావాగ్నినా దహ్యతే.

మ. కరిలూనం బయి కొంత, గాఢతుహినాక్రాంతార్దితచ్ఛిన్న మై
మఱియుం గొంత, నిదాఘభానుకరసంపత్దగ్ధ మై కొంత, యీ
వరకే కాననభూరిసీమఁ గదు భస్మం బయ్యెఁ; దావిక్ దిశో
దరముల్ నింపు లవంగనవ్యలతయుఁక్ దావాగ్నిలో వ్రగ్గెనా!

వకుళము

శ్లో. దధానః ప్రేమాణం తరుషు సమభావేన విపులాం
న మాలాకారోఽసా వకృత కరుణాం బాలబకులే
అయం తు ద్రాగుద్యత్కుసుమనికరాణాం పరిమళై
ర్దిగంతానాతేనే మధుపకులఝంకారభరితాన్.

శా. మాలాకారుఁ డదేల బాలవకుళక్ష్మాజమ్ముపైఁ నుంతయుఁ
జాలిం బూనఁడు ? సర్వభూరుహసమానప్రేమముం బూనియుఁ
ఖేలన్మత్తమిళిందఝుంకరణనాందీభూతదిక్సీమ హే
రాళం బయ్యది నింపదే కుసుమవారస్ఫారసౌరభ్యముల్.

శ్లో. నిసర్గాదారామే తరుకులసమారోపసుకృతీ
కృతీ మాలాకారో బకుళ మపి కుత్రాపి నిదధే
ఇదం కో జానీతే యదయ మిహ కోణాంతరగతో
జగజ్జాలం కర్తా కుసుమభరసౌరభ్యభరితమ్.

శా. ప్రాకుల్ నాటుటలో ప్రవీణుఁ డగుచుఁ రాజిల్లుచున్నట్టిమా
లాకారుండు ఘటించె నీబకుళబాలఁ మూల నెందో; యగుం
గా కెవ్వార లెఱుంగనేర్తు "రిదె యుద్గారించుఁ గోణస్థయై
వ్యాకోచత్కుసుమావళీపరిమళాంభశ్ఛర"మం చెంతయుఁ.

పలాండువు

శ్లో. కర్పూరధూళీరచితాలవాలః
కస్తూరికాకల్పితదోహదశ్రీః
హిమాంబుకుంభై రభిషిచ్యమానః
ప్రాంచం గుణం ముంచతి కిం పలాండుః?

ఉ. క్రాలుత దోహదంబు నెఱికస్తురిచే, హిమవాలుకావళీ
ధూళుల నాలవాలములు తుందిలలీల ఘటిల్లుతన్, హిమ
శీతలితాంబుకుంభములచే నభిషేకము లందుతన్, విడం
జాలదు ప్రాగ్గుణంబు నొకనాఁడును నీచపలాండు వింతయున్.

జంబీరము

శ్లో. కాంతి స్తే కనకాచలప్రతినిధిః కాంతాకుచస్పర్ధి తే
సౌభాగ్యం క్షితిపాలదర్శనవిధౌ త్వత్పూర్వకం దర్శనం
సౌరభ్యం సకలాతిశాయి భవతో జంబీర! కిం బ్రూమహే
కర్పూరప్రతికూలతా యది న తే త్వయ్యేవ సర్వే గుణాః.

చ. కనకనగానుకారు లురుకాంతులు,కాంతలగబ్బిగుబ్బదో
యిని నిరసించుశోభనము, లేపును జూపెడుకమ్మతావి,నీ
మునుకొనకుండ జేసెఁ గనఁ బోరఁట యోలకుచంబ! యెల్లమే
ల్గొనముల కిక్క వీవె,ప్రతికూలత కప్పిముతోడ లేనిచోన్.

పద్మము

శ్లో. అంతశ్ఛిద్రాణి భూయాంసి
కంటకా బహవో బహిః
కథం కమలనాళస్య
మా భూవన్ భంగురా గుణాః.

క. జలరుహనాళం బేగతిఁ
బొలుచున్ భంగురగుణాళిఁ బొందక మివులన్
గలిగెడు నంతచ్ఛిద్రం
బులు బహుళంబులయి బాహ్యమునఁ గంటకముల్.

శ్లో. రుచి రతిరుచిరా శుచిత్వ ముచ్చై
శ్శిరసి ధృత స్త్వయి మేవ శంకరేణ
కమలిని! మలినీకరోషి కస్మా
న్ముఖ మిద మిందు ముదీక్ష్య లోకకాంతమ్.

తే. గీ. రుచిరరుచి యంచు నత్యంతశుచి యటంచు
నఖిలలోకైకమోహనుం డంచు శశిని
బేర్మి నీశుఁడె నెత్తిపైఁ బెట్టుకొనఁగ
మో మదేలని కమలినీ! ముడుచుకొనెదు?

శ్లో. యావ త్త్వాం న ఖలు హసంతి కైరవిణ్యో
యావ త్త్వాం తరణికరాః పరామృశంతి
యావ త్తే మధువిభవో నవోఽస్తి తావ
న్మాధ్వీకం వితర సరోజ! షట్పదేభ్యః.

చ. కలువ లవెంతదాక నినుఁ గాంచి హసింపవొ, యెంతదనుకఁ జే
కలమధువైభవంబు విడఁజాలదొ నిన్, రవి బుజ్జగించునో
కలితకరాళి నెంతదనుక భవదంచితమూర్తి, నంతలో
పలనె యొసంగుచూ మధువు బంభరసంతతి కంబుజాతమా !

శ్లో. స్వచ్ఛందం దళదరవింద ! తే మరందం
విందంతో విదధతు గుంజితం మిళిందాః
ఆమోదా నథ హరిదంతరాణి నేతుం
నైవాన్యో జగతి సమీరణా త్ప్రవీణః.

చ. దళదరవింద ! నీ దమరఁ ద్వన్మకరందములన్ మిళిందముల్
పలుమరు "ఝుమ్ఝు"మ్మనుచు పానముసేయుచుగాక స్వేచ్ఛగా
సలలితసౌరభమ్ముల దిశాదశకాంకితముం బొనర్పఁగాఁ
గలితసమీరణావళులకంటెఁ బ్రవీణు లిఁ కెవ్వ రీయిలన్.

శ్లో. సముత్పత్తి స్స్వచ్ఛే సరసి హరిహస్తే నివసనం
నివాసః పద్మాయాః సురహృదయహారీ పరిమళః
గుణై రేతై రన్యై రపి చ లలిత స్యాంబుజ ! తవ
ద్విజోత్తంసే హంసే యది రతి రతీ వోన్నతి రియమ్.

చ. జననము స్వచ్ఛమానసరసి, సద్మము పద్మకు, నునికి విష్ణుదే
వుని కరసీమ, సర్వసురపుంగవమానసహారి తావి, యి
ట్లనుపమసద్గుణాకరత నందియు నాద్విజరాజహంసపై
వనరుహమా ! రతుల్ సెలఁగ వర్తిలుచో నవియే మహోన్నతుల్.

శ్లో. ఏతావ త్సరసిజకుట్మలస్య కృత్యం
ఛిత్వాంభ స్సరసి వినిర్గమో బహి ర్యత్
ఆమోదో వికసన మిందిరానివాస
స్తత్సర్వం దినకరకృత్య మామనంతి.

తే. గీ. వనజకుట్మలమ్ము బహిదుర్గమించును
జలము నొత్తిగించి సరసినుండి
తావి, వికసనమ్ము క్రీవాన, మిదియెల్ల
నంశుమాలికృత్య మని తలంత్రు

శ్లో. దళాని ముకులీకృత్య
ప్రవేశం న దదాతి చేత్
పద్మ! భృంగస్య కా హానిః
ఫుల్లే చూతే వనే స్థితే.

కం. ముకుళీకరించి దళముల
నొకయించకయుం బ్రవేశ మొసఁగవిమాత్రా
నకె! కొఱయా యళి కంబుజ!
వికసితసుమకలితచూతవితతులు లేవే?

శ్లో. అయి దళదరవిందస్యందమానం మరందం
త్వయి కిమపి లిహంతో మంజు గుంజంతు భృంగాః
దిశి దిశి నిరపేక్ష స్తావకీనం వివృణ్వన్
పరిమళ మయ మన్యో బాంధవో గంధవాహః.

చ. అళికులముల్ గళన్మధువు నాగళముల్ గర మారగించుచున్
దళదరవిందమా! కులుకుతన్ నవమంజులగుంజితమ్ములన్
ఇల నిరపేక్షుఁడై భవదహీనపరీమళముల్ దిశావళీ
కలితి మొనర్పు బాంధవుఁడు గంధవహుం డొకఁడే తలంపఁగన్.

శ్లో. కిం బాంధవేన రవిణా హరిణా చ కిం వా
లక్ష్మ్యా చ కిం సరసిజోదరజన్మనా వా
ఏతస్య శుద్ధచరితస్య సరోరుహస్య
నైషా తుషారజనితా శమితా విపత్తిః.

తే. గీ. అమలచరితాంబుజంబు దా ననుభవించు
మహితహిమసంజనితబాధ మాన్పుకున్న
మాధవుం డేల? రమ యేల? వేధ యేల?
బాంధవుం డై మెసంగెడుభానుఁ డేల?

శ్లో. మా గాః ఖేదం కమలకిరణై రేవ సద్యః స్ఫురద్భిః
ప్రాలేయాంశు ర్య దిహ కుముదామోద మావిష్కరోతి
నానుగ్రాహ్యం యదసి మహతా మీదృశానా మయం తే
మన్యే కాలా దిహ పరిణతః ప్రాక్తనో దుర్విపాకః.

మ. సరసీజాతమ! ఖేదముం గనకుమా సద్యస్స్ఫురద్దీధితుల్
మురియన్ శీతకరుం డొనర్చెఁ గుముదామోదం బటం చాత్మలోఁ;
బరిశోధింపఁగరాదు చూవె సుమహద్వర్యక్రియారంభముల్
కర మిద్దాని సనాతనావిధివిపాకం బంచు నూహించెదన్.

శ్లో. సంభాతి స్తవ మానసే సరసిజ! త్వత్సౌరభై ర్వాసితాః
సర్వా స్తాః కకుభ స్తవాయి! పరమో బంధు ర్వివస్వా నపి
త్వం చే దద్య గుణానవద్యశిశిరే శీతానిలై శ్శీర్యసి
ప్రాయః ప్రాయ ఇదం త దత్ర పరమం దృష్ట్వా న దృష్టం ఫలమ్.

మ. భవదీయామలసౌరభోదయముచే వాసించు నాశాళి, నీ
భవ మా మానస సీమ, బంధువు వివస్వంతుండు నీ; కెంతయో
యివతాళించెడువాయువుల్ శిశిరమం దేపారుచో శీర్ణమా
దువు నీరేజ! భుజింపఁ దప్పునె పురాదుష్టానదృష్టోద్ధతుల్.

శ్లో. న కులే నాపి చ శీలే
న చాపి రూపేఽస్తి కశ్చి దుత్కర్షః
య త్పృష్టాసి మిళిందా
నరవింద! మహత్వ మేత త్తే.

ఆ. వె. కులమునందుఁ గాని గుణములందును గాని
రూపమందుఁ గాని యేపు కలదె?
విందు సేయుచుందు విందిందిరంబుల
కదిర! జలజ! నీమహాత్మ్య మేమొ!

శ్లో. మధుప ఇవ మారుతేఽస్మిన్
మా సౌరభలోభ మంబుజిని! మంస్థాః
లోకానా మేవ ముదే
మహితోఽప్యాత్మా మునార్థితాం నీతః.

ఉ. మారుతమందుఁ గూడ మధుమత్తమిళిందమునందుఁ బోలె హా!
సౌరభలోభ మున్నదని చాల దలంపకు మమ్మ పద్మినీ!
ధారణిలో నశేషజనతాఘనతోషణచిత్తవృత్తి నీ
తీరున నీచయాచకతఁ దేలె జుమీ మహితాత్ముఁ డయ్యుఁ దాన్.

శ్లో. కమలిని! మలినీకరోషి చేతః
కిమితి బకై రవహేలితానభిజ్ఞైః
పరిణతమకరందమార్మికాస్తే
జగతి భవంతు చిరాయుషో మిళిందాః.

ఆ. వె. మనసు పాడుచేసికొనకుము కమలినీ!
యజ్ఞబకావహేలనాప్తిచేత
మహితపరిణతోరుమకరందమర్మజ్ఞ
మధుకరములు చిరము మనెడుఁగాక.

శ్లో. పౌలోమీపతికాననే విలసతాం గీర్వాణభూమీరుహాం
యే నాఘ్రాతసముజ్ఝితాని కుసుమా న్యాజఘ్రిరే నిర్జరైః
తస్మిన్నద్య మధువ్రతే విధివశా న్మాధ్వీక మాకాంక్షతి
త్వం చే దంచసి లోభ మంబుజ! తదా కిం త్వాం ప్రతిబ్రూమహే.

ఉ. నందనపారిజాతసుమసన్తతి మూర్కొని వీడ నేవరేం
దిందిర, మాసుమావళినె నిర్జరులుం జవిగొన్నవారమో !
డింద నదృష్ట మయ్యెళి వశిం గనె మాధవికాభిలాష; నీ
వందిన లోభ మంబుజము ! యుప్పుడికేమనువార మాపయిన్.

శ్లో. నీరా న్నిర్మలతో జని ర్మధురతా రామాముఖస్పర్థినీ
వాసః కిం చ హరేః కరే పరిమళో గీర్వాణచేతోహరః
సర్వస్వం త దహో మహాకవిగిరాం కామస్య చాంభోరుహ !
త్వం చే త్ప్రీతి మురీకరోషి మధుపే త త్త్వాం కి మాచక్ష్మహే.

మ. పరితోనిర్మలవారి నీజని, వధూభవ్యాననస్పర్థి మా
ధురి, వాసంబు మురారిచారుకరమందుఁ, నిర్జరాళీమనో
హార మామోదము, కామదేవకవిరాజాలాపసర్వస్వ మీ
వరయఁ బద్మిని! నీకుఁ బ్రీతి మధుపంబం దైన ని న్నేమనన్ !

పుష్పము

శ్లో. అంజలిస్థాని పుష్పాణి
వాసయంతి కరద్వయం
అహో ! సుమనసాం ప్రీతి
ర్వామదక్షిణయో స్సమా.

తే. గీ. అంజలి నెసంగుకుసుమముల్ హస్తయుగళి
నింపు పెంపారఁగ బరిమళింపఁజేయు
నహహ ! సుమనోఽనుత్ప్రీతి యులరుఁగాదె
వామదక్షిణముల సమత్వము వహించి.

నందనవనము

శ్లో. స్వర్లోకస్య శిఖామణి స్సురతరుగ్రామస్య ధా మాద్భుతం
పౌలోమీపురుహూతయోః పరిణతిః పుణ్యావళీనా మపి
సత్యం నందన ! కిం త్విదం సహృదయై ర్నిత్యం విధిః ప్రార్థ్యతే
త్వత్తః ఖాండవరంగతాండవపటు ర్దూరేఽస్తు వైశ్వానరః.

శా. పౌలోమీపురుహూతపుణ్యనుపరీపాకంబు, స్వర్యాభజన
త్కేళీధామము నాకలోకమణి వాఁ గీర్తిన్ గడుం గొంటి వ
య్యా! లీలాలసమానసందనమ! నీ కాఖాండవక్షోణి ని
శ్చేలప్రక్రియఁ దాండవించుశిఖి దూరీభూతుఁడై క్రాలుతేన్.

మా లా కా రుఁ డు

శ్లో. తోయై రల్పై రపి కరుణయా భీమభానౌ నిదాఘే
మాలాకార! వ్యరచి భవతా యా తరో రస్య పుష్టిః
సా కిం శక్యా జనయితు మిహ ప్రావృషేణ్యేన వారాం
ధారాసారా నపి వికిరతా విశ్వతో వారిదేన.

శా. మాలాకార! కృపారసం బెసఁగ భీష్మగ్రీష్మభానూష్మదు
ష్కాలంబం దుదకాల్పసేచనత వృక్షశ్రేణి కేపుష్టి నీ
వోలిం గూర్చితొ! ప్రావృషేణ్యజలదం బుచ్చైఃపయస్సారధా
రాళిం దాదృశపుష్టి నేకరణి నీయంజాలు వాలాయమున్

బ ద రి

శ్లో. భో భో వసంత! భవదభ్యుదయేన వృక్షాః
కే నామ పుష్పఫలపల్లవశాలిన స్స్యుః
అస్మాక మల్పతపసాం బదరీతరూణాం
భ్రష్టం ఫలం చిరశిఖాపటలం ప్రలూనమ్.

చ. అలరెఁ గదా వసంత! భవదభ్యుదయంబున భూజరాజముల్
ఫలవితతిన్ సుమావళిఁ బ్రవాళములం బరిపూరితంబులై;
ఫలములె కాదు మున్వెలయుపత్రము లన్నియుఁ గూడ రాలె రేఁ
గుల మగుమాకు పూర్వమునఁ గొంచెముగాఁ దప మాచరించుటన్

స ము ద్ర ము

శ్లో. అబ్ధీ రత్న మధో ధత్తే
ధత్తే చ శిరసా తృణం
అబ్ధే రేవ హి దోషోఽయం
రత్నం రత్నం తృణం తృణమ్.

ఆ. వె. అంబురాశి మణుల నడుగునఁ బడవైచి
శిరమునందుఁ దృణముఁ జేర్చుకొనును;
ఇందు దోష మబ్ధిదే కాని వే ఱేమి ?
మణులు మణులె మఱియుఁ దృణము తృణమె.

శ్లో. తరంగమాలికాభీల !
ధిక్ తే సాగర! గర్జితం
యస్య తీరే తృషాక్రాంతాః
పాంథాః పృచ్ఛంతి వాపికామ్.

తే. గీ. పాంథు లమితతృషార్తులై వాపికార్థ
మారయుచు నున్న వారు నీతీరమందె
సిగ్గుఁ గనఁబోక పయిఁగ గర్జింతు వేల?
సాగరా ! భంగసంఘనిస్తంద్రగతుల.

శ్లో. సాకం గ్రావగణై ర్లుఠంతి మణయ స్తీరేఽర్కబింబోపమా
నీరే నీరచరై స్సమం స భగవా న్నిద్రాతి నారాయణః
ఏవం వీక్ష్య తవావివేక మపి చ ప్రౌఢిం పరా మున్నతేః
కిం నిందా న్యథవా స్తవాని కథయ క్షీరార్ణవ! త్వా మహమ్.

చ. పొరలు మణుల్ ఖరాంశునిభముల్ చిఱుతాలను గూడి యొడ్డునన్
హరి కనుమోడ్చు నీజలములందు జలేచరసంఘసంగియై
విరిసిన తావకీన మవివేకము గన్గొని దూరు మందువో
యరుదగు ప్రౌఢిమన్ బొగడు మందువొ చెప్పు పయఃపయోనిధీ !

శ్లో. కిం ఖలు రత్నై రేతైః
కిం పున రభ్రాయితేన తే వపుషా
సలిల మపి య న్న తావక
మర్ణవ! వదనం ప్రయాతి తృషితానామ్.

ఆ. వె. జలధినాథ ! యాకన మ్మెంటుతనువుచేఁ
గలితమణులచేత ఫలముగలదె ?
తావకీనవారి దప్పికగొనువారి
నోటఁ బోసికొనఁగ నోచుకొనవు.

శ్లో. స్వ స్త్యస్తు విద్రుమవనాయ నమో మణిభ్యః
కల్యాణ మావహతు మౌక్తికశుక్తిమాలా
ప్రాప్తం మయా సకల మేవ ధనం పయోధే !
యద్వారుణై ర్జలచరై ర్న విదారితోఽస్మి.

చ. జలచరదారితుండ నయి చావక జీవముతోడ నుంటచే
నలరుదు సర్వసంపదల నందినరీతిగనే నితాంత మో
జలనిధి! విద్రుమాటవికి స్వస్తి యగున్; నవశుక్తిమౌక్తికం
బుల కగుఁగాక మంగళము; భూరిమణీతతికిన్ నమస్కృతుల్.

శ్లో. పీయూషేణ సురా, శ్శ్రియా మురరిపు, ర్మర్యాదయా మేదినీ
శక్రః కల్పరుహై ర్శశాంకకలయా శ్రీశంకర, స్తోషితః.
మైనాకాదినగా నిజోదరగతా యత్నేన సంరక్షితా
మచ్ఛాన్యే కరణే ఘటోద్భవమునిః కేనాపి నో వారితః

శా. ప్రీతిం గాంచెను దైవతాళి సుధచే, శ్రీచే మురధ్వంసి, గ్లా
చేతన్ శంభుఁడు, కల్పభూజములచే జిష్ణుండు, మర్యాదచే
భూతాధారధరిత్రి, యాంతరసుఖాభోగాప్తి మైనాకముల్
ద్రాతం గానను కుంభసంభవుఁడుచేతంబూనిన ద్రావుచో.

శ్లో. మహ్యం శ్రీ రితి శార్ఙ్గభృ; త్త్రిదశరా ట్చింతామణి ర్మహ్య మి
త్యబ్జో మహ్య మితీశ్వర; స్సురగణో మహ్యం సుధా చాస్త్వితి
సర్వే సం త్యపహర్తు మేవ జలధే స్సర్వస్వ మేనం రుషా
హం తాచామతి తాపసే న గదితుం కోఽప్యస్తి తన్మా స్త్వితి.

మ. సిరి నా కం, చమృతమ్ము నాది యనుచుం, జింతామణిం బ్రీతి మ
త్సరమంచుర్,మిహికాంశు బాలకుఁడు నావాఁడంచు,నాశ్వంబుర్
సురలుర్ పాకవిరోధియున్ హరుఁడు వేఁ జూరాడిరే కాని సా
గరుసర్వస్వము; దానిఁ బ్రాపుముని నొక్కండైన వారించెనే !

శ్లో. శేతే యత్ర హరి ర్వసంతి గిరయో మజ్జంతి దిగ్దంతినో
మత్స్యా స్సంతి తిమింగిలప్రభృతయో గర్భం దధాత్యంబుదః
పర్యాయేణ ఖరాంశుశీతకిరణా వున్మజ్జతో మజ్జతః
పాథ స్తత్ర న సంపిబంతి యది తే కిం దూషణం వారిధే !

మ. హరి నీపైఁ గనుమోడ్చు, శైలములు నీయం దావసించుర్, దిశా
కరటుల్ మున్గు, ధరించు వారిధరముల్ గర్భంబు, తైమింగిలో
త్కర మేపారు, మునుంగుఁ దేలుఁ గ్రమతం దారేశుఁడు న్భానుఁడున్
నరుఁ డొక్కండును నీజలమ్ముఁ గొనకున్నన్ వార్ధి! నీదోషమా ?

శ్లో. అయి రోష మురీకరోషి నో చే
త్కిమపి త్వాం ప్రతి వారిధే! వదామః
జలదేన తవార్థినా విముక్తా
న్యపి తోయాని వహా న్నహో జహాసి.

ఉ. రోషము లంతరంగమునఁ గూడనిచో నినుఁ గూర్చి కొంతయే
దో పలుకం దలంచితి మహోదధినాథ ! య దేమనందువా
బాపురె ! తావకార్థిజలవాహవిహాపితతోయ మూని యే
యేఘు వహించి క్రమ్మర రహి న్విడనాడుచు నుందు వెంకయున్.

శ్లో. గ్రావాణో మణయో హరి ర్జలచరో లక్ష్మీః పయోమానుషీ
ముక్తౌఘా స్సికతాః ప్రవాళలతికా శ్శైవాల మంభ స్సుధా
తీరే కల్పమహీరుహాః కి మపరం నామ్నాసి చాంభోనిధి
ర్దూరే కర్ణరసాయనం నికటత స్తృష్ణాపి నో శామ్యతి.

ఉ. ఱాలు మణుల్, మురారి శేఖరమ్ము, రమాపతి వారిమానుషీ
బాలిక, మౌక్తికావళులు వాలుక, విద్రుమసంచయంబు శై
వాలము, నీరముల్ సుధలు, వార్ధికి నొద్దున కల్పకమ్ము, దా
డాల శ్రవోరసాయనము, దాపునఁ దాఁ దృషఁ దీర్ప దింతయున్.

సరోవరము

శ్లో. కాసారవర్య! కలితాంబురుహావతంస!
ముక్తాసమానజలబిందుతరంగభంగ!
కిం భూషణం తవ బకై ర్బహుభిః కురాపైః
హంసై ర్వినా కలరవై ర్నరదేవపూజ్యైః.

తే. గీ. కలితజలజావతంస! ముక్తాసమాన
వారికణభంగసంఘ! కాసారవర్య!
చారురవసర్వమాన్యహంసతతి గాక
కారవబకాళి నీ కలంకార మగునె?

శ్లో. భో భో సర స్త్వదుదరాంతరవ ర్తితస్య
త్వత్పూర్ణతాతిపరితోషితచి త్తవృత్తేః
త్వజ్జీవనేన సహ జీవన మస్య న శ్యే
న్మీనః క్వ జీవతి క మాశ్రియ తేఽతిదీనః.

చ. భవదుదరాంతరంబునఁ బ్రవర్తిలుచుం, భవదీయపూర్ణతా
భవపరితోషచిత్త మయి, త్వద్వరిజీవనమే స్వజీవనం
బవు నని మానసించుచు భయాకులతం గను దీనమీన, మిం
కెవని సమాశ్రయించు సరసీ! గతి యేది నశింప నీ వహో!

శ్లో. యాతే మయ్యచిరా న్నిదాఘమిహిరజ్వాలాశతై శ్శుష్కతాం
గంతారం ప్రతిపాంథసంతతి రసౌ సంతాపమాలాకులా
ఏవం యస్య నిరంతరాధిపటలై ర్నిత్యం వపుః క్షీయతే
ధన్యం జీవన మస్య మార్గసరసో ధి గ్వారిధీనాం జనుః.

చ. పరుషనిదాఘభానుకరపావకకీలల నింక నేను దు
ర్భరతృషఁ దాప మందుఁ బ్రతిపాంథు డటంచు నిరంతరాధిచేఁ
గరము కృశించె సత్పథవికల్పితసారసరోవరంబు; త
ద్వరతరజీవనంబె కడు ధన్యము, వార్ధిభవంబు కాల్పనా!

శ్లో. ఆపేదిరేఽంబరపథం పరితః పతంగా
భృంగా రసాలముకుళాని సమాశ్రయంతి
సంకోచ మంచతి సర స్త్వయి దీనదీనో
మీనో ను హంత ! కతమాం గతి మభ్యుపైతు.

చ. అమలరసాలసాలముకుళావళి నోలి సమాశ్రయించుభృం
గములు, విహాయసాంగణముఁ గ్రమ్ముచుఁ జేరుపతంగముల్ సమ
స్తమును రవంత నీవు కన సంకుచితాత్మత; దీనదీనమీ
నము మఱి యెట్టిదుర్గతిఁ గనం జనునో సరసీవరోత్తమా!

శ్లో. ఇయత్యాం సంపత్తా వపి చ సలిలానాం త్వఁ మధునా
న తృష్ణా మార్తానాం హరసి యది కాసార ! సహసా
నిదాఘే చండాంశౌ కిరతి పరితోఽంగారనికరం
కృశీభూతాః కేషా మహహ ! పరిహర్తా సి ఖలు తామ్.

ఉ. ఇంతగ నీరుగల్గినపుడే కృప నీవు నిరంతరార్తతృ
ష్ణాంతి మొనర్పకున్న కమలాకర ! చండనిదాఘవేళ భా,
స్వంతుఁడు నిప్పుకల్ గురియుఁ జాల కృశించి నశించువేళ న
య్యంతమునందు నక్కటకటా ! యవనం బొనరింప శక్యమే ?

కూ ప ము

శ్లో. సితరాం నీచోఽస్మీతి
త్వం ఖేదం కూప! మా కదాపి కృథాః
అత్యంతసరసహృదయో
యతః పరేషాం గుణగ్రహీతాసి.

తే. గీ. నిరతనీచత గలదాన నే నటంచు
కూపమా! యెన్నఁడును నీవు కుందఁబోకు,
సరసహృదయవు గావున పరగుణాగ్ర
హీత్రి వై లోకతృష్ణ మాయింపఁగలవు.

హిమాలయము

శ్లో. తరుకులసుషమాపహారాం
జనయంతీం జగతి జీవజాతార్తిం
కేన గుణేన భవానీ
తాత! హిమానీ మిమాం వహసి.

క. ఆతతతరుకులసుషమా
ఘాతుక మై జీవజాతగురుతాపకరం
బై తనరుహిమాని భవా
నీతాతా! యేమి చూచి నీ వూనితివో.

సీర

శ్లో. వనాంతే ఖేలంతీ శశకశిశు మాలోక్య చకితా
భుజప్రాంతం భర్తుర్భజతి భయహర్తుస్సపది యా
అహో! సేయం సీతా దశవదననీతా హలరదైః
పరీతా రక్షోభిశ్శ్రయతి వివశా కా మపి దశామ్.

చ. అళుకలమన్ శశార్భకము నారయుటన్ వనిలోఁ జరించుచోఁ
జలితకరంబులన్ వరభుజాయుగళిం బెనవైచి పట్టె నే
యలికులనీలకుంతల దశాననదానవనీత సీత హా!
హాలరదనోగ్రరాక్షసనమంతరసీమ నెటులో వసించెనో !

శ్లో. ఖద్యోతో ద్యోతతే రాత్రౌ
యావన్నోదేతి చంద్రమాః
ఉదితే తు సహస్రాంశౌ
న ఖద్యోతో న చంద్రమాః.

తే. గీ. ఇంత వెనుక చందురుం డుదయించు వఱకె
మిణుగురుపుంబురువ్వులు ద్రియామ మెఱయుచుండు
ఖరతరసహస్రకిరణముల్ పఱవ నిపుడు
లేవు ఖద్యోతశశిరుచుల్ లేవు లేవు

చంద్రుఁడు

శ్లో. రాజానః కతివా న సంతి జగతి ఖ్యాతా నిజాభ్యాశగాః
యే పుష్ణంతి బలీయసః పరిచితాం శ్చిత్రం న మన్యామహే
రాజా రాజతి కేవలం హిమకరః పుష్ణాతి దూరస్థితాన్
జ్యోత్స్నాభి ర్గపితా న్దినేశ మహసా యో౽సౌ చకోరా నిమాన్.

చ. ఇలపయి రాజు లెందఱుదయింపరు! సంతతసన్నిధానవ
ర్తుల బలశాలులన్ బరిచితుం బఁపోషణ మాచరించువా
రలయిక నంది భానుకిరణాహతి దవ్వుల నిల్చియున్న వె
న్నెలపులుఁగుల్ పశీతలఘృణిం దనియించెడు రాజె రా జగున్.

శ్లో. జన్మ శ్రీరమహార్ణవే సహభువ శ్శ్రీపారిజాతాదయో
బింబం యస్య సుధామయం త్రిభువనాధీశస్య మూర్ధ్ని స్థితిః
వృత్తి ర్యస్య చరాచరప్రియతమా తస్యోదయే కేవలం
సంకోచః కమలస్య దుష్కృతి రహో నింద్యో న తారాపతిః.

చ. జననము క్షీరవార్ధి, స్థితి శంకరునౌదలఁ, గల్పకాదులా
తనయనుజన్ములే, నవసుధామయమే నిజబింబ, మాత్మవృ
త్తి నిఖిలసృష్టిలోలము, తదీయమహోదయవేళ నిచ్చలున్
వనజము గాంచు సంకుచితభావమె దుష్కృతి; నింద్యుఁ డిందుఁడా?

శ్లో. ఉడుగణపరివారో నాయకో౽ప్యోషధీనాం
అమృతమయశరీరః కాంతియుక్తో౽పి చంద్రః
భవతి విగతరశ్మి ర్మండలం ప్రాప్య భానోః
పరసదననివిష్టః కో లఘుత్వం న యాతి.

చ. అమృతమయాంగుఁడయ్యు, సుషమాంచితుఁడయ్యు మహౌషధీశుఁడై
యమరియుఁ, దారకాంతరితుఁ డయ్యు, విభావసుమండలంబునన్
హిమకరుఁ డావసించుట నహీనముగాఁ గనెఁ గాంతిహీనతన్
అమితలఘుత్వమున్ పరగృహస్థితిచే నెవఁ డందకుండెడిన్.

శ్లో. తృష్ణాలోలవిలోచనే కలయతి ప్రాచీం చకోరీగణే
మౌనం ముంచతి కించ కైరవకులే కామే ధను ర్ధున్వతి
మానే మానవతీజనస్య సపది ప్రస్థాతుకామేఽధునా
ధాతః ! కిం ను విధౌ విధాతు ముచితో ధారాధరాడంబరః.

చ. కనుఁగొనఁగాఁ జకోరికలు గాఢతృషాకలనావిలోలలో
చనములఁ బ్రాచి, మౌనములు జాఱఁగఁ గైరవపాళి, మ్రోయఁగా
మనసిజువిల్లు, పోఁదలఁప మానవతీజనతాభిమానమున్
వనజభవా ! విధింపనగునా హిమధామునిపై ఘనార్భటిన్?

మారుతము

శ్లో. సన్నా నావికధోరణి ర్నిపతితా మధ్యేజలం క్షేపణిః
పంథాః పర్వతదుర్ధరో ఘనఘనచ్ఛన్నశ్చ తారాపథః
భో భో మారుత ! దుస్తరో జలనిధి శ్శీర్ణా చ నౌ రద్య న
స్త్వాం నిర్మజ్జయ వా తటం గమయ వా హస్తే తవాస్తే ద్వయమ్.

మ. పడె నీరాంతరసీమ క్షేపణి, నభోభాగంబు నంభోదముల్
కదుఁ గప్పెన్; జెడె నావ; నావికుఁ డశక్తత్వంబు సూచించెఁ, దా
గడవన్ దుస్తర మబ్ధి; యద్రిగతమార్గం; బొడ్డునం జేరుపో
జడధిన్ ముంచుమో ! రెండు నున్నవి మహాసామీర ! నీచేతిలోన్.

నది

శ్లో. తటిని ! చిరాయ విచారయ
విన్ధ్యభువ స్తవ పవిత్రాయాః
శుష్యంత్యా అపి యుక్తం
కిం ఖలు రథ్యోదకాదానమ్.

తే. గీ. వింధ్యగిరిఁ బ్రభవించి పవిత్రమూర్తి
నైననీవు కృశించియు నంద వగునె!
కలుషరథ్యోదకాదానకాంతిమున్క
మానసింపు తరంగిణీమణి! కరమ్ము.

శ్లో. న వారయామో భవతీం విశంతీం
వర్షానది! స్రోతసి జహ్నుజాయాః
న యుక్తమేతత్తు పురో యదస్యా
స్తరంగభంగాన్ ప్రకటీకరోషి.

తే. గీ. జహ్నుకన్యాప్రవాహానుషంగదీక్ష
సాగు నిన్నడ్డుకొనము వర్షాస్రవంతి
భంగభంగమ్ము లెంతేని బాహిరింప
వలదు వల దమ్మ! తత్పురోభాగమందు.

శ్లో. రే చాంచల్యజుషో మృగాః శ్రితనగాః కల్లోలమాలాకులా
మేతా మంబుధికామినీం వ్యవసితా స్సంగాహితుం వా కథం
అత్రైవోచ్ఛలదంబునిర్భరమహావర్తైస్సమావర్తితో
యద్గ్రావేవ రసాతలం పున రసౌ యాతో గజగ్రామణీః.

చ. నగతటి నాశ్రయించుచు మనమ్ములఁ జాపల మూరఁ బొల్చునో
మృగతతులార! క్రుంకుతల పేటికి నీ కుదధీశకామినిన్
ఒగి నిటనే మదేభము మహోపలమట్లు మునింగిపోయెఁ దా
నగతికతన్ రసాతలము నందె నుడిం బడి సంభ్రమించుచున్.

కపోతము

శ్లో. కామం సుధాకరకరామృతదివ్యరూప
సౌభాగ్యపీతనివర్ణ స పికోఽస్తు కాకః
శ్రీనందకీరమణసంగమకంఠలగ్న
పుణ్యత్సుధామణితవి త్వ మసౌ కపోత!

శా. కాకంబో పికమో సుధాకరకరాఖండామృతాకారసా
ధాకుంభీభవదగ్రపీఠమునఁ దా వాసీన యౌఁగాక యో
హో! కాపోతమ! సుందరీరమణరత్యుత్సాహనిస్సార్యమా
ణాకూతాతతికూజితాంతరితభావావేశముల్ నేర్చునే?

శ్లో. క్రుద్ధోలూకనఖప్రపాతవిగళత్పక్షా అపి స్వాశ్రయం
యే నోజ్ఝంతి పురీషపుష్టవపుష స్తే కేచి దన్యే ద్విజాః
యే తు స్వచ్ఛతరంగిణీబిసలసల్లేశేషు సంవర్ధితా
గంగానీర మపి త్యజంతి కలుషం తే రాజహంసా అమీ.

మ. కుపితోలూకవికర్తితచ్ఛదములై గూండ్లకన్ విడంబోవమో!
వపురాపోషణముం బురీషముల సంపాదించుచున్ ఖేటముల్
ఉపసర్పించు వినిర్మలాపగలయం దోలిన్ బిసాహారులై
యపవర్జించు మరాళముల్ కలుషగంగాభంగభంగాంబువుల్.

శ్లో. కాకాః పరిభుపరిణీహితాః పికపంక్తిబృందైః
మాకందబృందమకరందరసాన్ పిబంతు
ప్రాప్తే వసంతసమయే కథ మాచరంతి
కర్ణామృతాని కలపంచమకూజితాని.

ఉ. కందళితాంతరంగమునఁ గాకము లాపికరాజిఁ గూడి మా
కందమరందబిందువులఁ గమ్మఁగఁ బానము సేయుఁగాక; యే
చందమునన్ శ్రవోయుగరసాయనపంచమకూజితావళిం
జిందఁగఁజాలుఁ జాల వికసించిన తన్మధుమాసవేళలన్.

శ్లో. ఏకం ద్విజం చ స్పృహణీయవాచం
మత్తద్విరేఫం చ మధుః పుపోష
సతో గుణా న వ్యసతోఽపి దోషాన్
జాత్యా విహీనో న వివేక్తు మీష్టే.

ఉ. లాలన సేయుచుం గమవిలాస మెసంగఁగఁ బెంచె మత్తచం
డాలి, నొకండె మైనద్విజనాయకు నామధు వేకరీతిఁ; దా
నేల సమర్థుఁడౌ గులవిహీనుఁ డసత్పరిభాసమానదో
షాళిని సత్సదాశ్రితగుణాళి వివేచన మాచరింపఁగన్.

శ్లో. పలాశకుసుమభ్రాంత్యా
శుకతుండే పత త్యళిః
సోఽపి జంబూఫలభ్రాంత్యా
త మళిం ధర్తు మిచ్ఛతి.

తే. గీ. రమ్యపాలాశపుష్పవిభ్రాంతి గ్రాల
వ్రాలె శుకచంచుపుటి నొండుబంభరంబు
శుకము జంబూఫలభ్రాంతి జొబ్బిలంగ
భృంగధవుని గుటుక్కున మ్రింగ నెంచె.

శ్లో. నిరర్థకం జన్మ ఫలం నళిన్యా
యయా న దృష్టస్తుహినాంశుబింబః
ఉత్పత్తి రిందో రపి నిష్ఫలా హి
దృష్టా వినిద్రా నళినీ న యేన.

తే. గీ. ఇందుబింబంబు దర్శింపనందువలన
నాళినీజన్మఫలము నిరర్థకమ్ము
వికచనళినీముఖమ్ము గాన్పింపకునికి
శశధరుభవంబుఁ గూడ నిష్ఫలమె యగును.

శ్లో. గర్జతి శరది న వర్షతి
వర్షతి వర్షాసు నిస్వనో మేఘః
నీచో న వదతి కురుతే
న వదతి సుజనః కరో త్యేవ.

చ. స్తనితముల్ రచించుటయె తక్క శరత్సమయంబునందు జీ
వన మిడ దంబుదంబు, పటువార్షికవాసరమందు మేఘముల్
నినుచు సువృష్టి గర్జిలక ; నీచుఁడు వల్కుటె కాని చేయఁడుం
డును ; తమి నాచరించు సుజనుం డొకమాటయు నాడకుండఁగన్.

శ్లో. సతాం ధనం సాధుభి రేవ భుజ్యతే
శుకాదయ శ్చూతఫలాని భుంజతే
దురాత్మభి ర్దుశ్చరితాత్మనాం ధనం
భవంతి నింబాః ఖలు కాకభోజనాః.

ఉ. కీరము లారగించుఁ దమకించుచు సారరసాలపాళి; స
త్పూరుషభూరిభాగ్య మనుభోగ్యము సాధులకున్, మనోహరా
హారము కాకిలోకమున కౌఁ బిచుమందఫలమ్ము; దుర్జనా
పారధనమ్ము దుర్జనులపాలె యగున్ మిగులన్ జగంబులన్.

శ్లో. అమితగుణోఽపి పదార్థో
దోషే ణైకేన నిందితో భవతి
నిఖిలరసాయనమహితో
గంధే నోగ్రేణ లశున ఇవ.

తే. గీ. తతగుణోన్నత మగుపదార్థమ్ము కూడ
దోష మొక్కండు గలదేని దూష్య మగును
ఘనరసాయనమహితమై గ్రాలుచున్న
నిశితగంధ ముద్గారించు లశున మట్లు.

శ్లో. గుణా గుణజ్ఞేషు గుణా భవంతి
తే నిర్గుణం ప్రాప్య భవంతి దోషాః
ఆస్వాద్య తోయాః ప్రభవా హి నద్యః
సముద్ర మాసాద్య భవం త్యపేయాః.

తే. గీ. గుణములు గుణజ్ఞులం జేరి గుణము లగును
అవియె నిర్గుణుఁ జేరి దోషాళు లగును
అనిశ మాస్వాదనీయంబు లైననదులు
కర మపేయంబు లగును సాగరముఁ జేరి.

శ్లో. మార్జారో లభతే న మంజులశుకారావేన కౌతూహలం
కస్తూరీహరిణస్య సౌరభభరై స్సింహో న సంతుష్యతి
ప్రీతి ర్నాస్తి మయూరతాండవకలై ర్వ్యాఘ్రస్య దుష్టై స్సదా
వ్యాప్తాయాం భువి సంతి కేఽపి విరసా స్సంతో గుణగ్రాహిణః.

మ. పరమానందము నందునే చిలుక ద్రాఁ బల్కన్ బిడాలంబు, ము
ష్కరభిల్లాళికిఁ గేకితాండవము శ్లాఘ్యం బౌనె? కస్తూరికా
హరిణామోదము దన్పునే భయదపంచాస్యంబు, నేపారు నీ
ధర లేరే గుణవేను లౌచు సరసుల్, దర్పించుచున్ నీరసుల్.

శ్లో. మృగమద! మా కురు గర్వం
పరిమళమాత్రేణ తం త్వ ముపయాసి
పరిమళశీతలతాని
ర్మలతాసుకుమారతా చ కర్పూరే.

తే. గీ. మృగమదమ! యింత యవలేప మేల? చాలు
కలపరిమళగుణ మొండె కలదు నీకుఁ
గలవు పరిమళమే కాక కర్పూరమున
నమితశీతలతామృదుతామలతలు.

శ్లో. కృష్ణో వా మలినో౽స్తు వా మృగమదః కిం జాత మేతావతా
కో౽ప్యన్యో౽నవధిశ్చమత్కృతివిధి స్సౌరభ్య మేకో గుణః
యే నాయం స్మరమండనైకవసతిః ఫాలే కపోలే గళే
దోర్మూలే కుచమండలే చ కురుతే సంగం కురంగీదృశామ్.

ఉ. నీలమొ గౌరమో పరిగణింపఁ బనేమి మృగీమదమ్ము; వే
యేల! పరీమళైకగుణమే తగు; నయ్యది యావసింపదే
బాలకురంగలోచనలఫాలములందు, గళంబులందు, దో
ర్మూలములం, గపోలముల, ముగ్ధవిదగ్ధకుచద్వయంబులన్.

శ్లో. అతిపరిచయా దవజ్ఞా
సంతతగమనా దనాదరో భవతి
మలయే భిల్లపురంధ్రీ
చందనతరుకాష్ఠ మింధనం కురుతే.

తే. గీ. అతిపరిచయంబుచేఁ దిరస్కృతి లభించు
నిరతగమనంబుచే ననాదరణ మెసఁగు
నలపులిందకుటుంబిని మలయశిఖరిఁ
జందనము నింధనమ్ముగాఁ సలుపుఁగాదె.

శ్లో. గీర్భి ర్గురూణాం పరుషాక్షరాభి
స్తిరస్కృతా యాంతి నరా మహత్త్వం
అలబ్ధశాణోత్కషణా న్నృపాణాం
న జాతు మౌళౌ మణయో వసంతి.

చ. గురుపరుషాక్షరప్రకరగుంఫితవాగతిమాత్రయుక్తిచే
గరము తిరస్కృతిం బడసి కాంచు మహత్త్వముల న్నరుండు; భూ
వరవరమౌళిభాగము నివాసము సేసికొనంగ నోనె? దు
ర్భరతరశాణసంకషణబాధల నందకయున్నచో మణుల్.

శ్లో. వ్యోమని వాసం కురుతే
చిత్రం నిర్మాతి యత్నతః సలిలే
స్నపయతి పవనం సలిలై
ర్యః క్షుద్రే చరతి సత్కారమ్.

తే. గీ. ప్రీతి నీచాత్మునిన్ సత్కరించువాఁడు
వాస మంబరమునఁ జేయువాఁడు వాఁడు
వారిఁ జిత్రముఁ జిత్రించువాఁడు వాఁడు
పవనమును నీటఁ దడిపెడువాఁడు వాఁడు.

శ్లో. యస్మిన్ ఖేలతి సర్వతః పరిచలత్కల్లోలకోలాహలై
ర్మంథాద్రిభ్రమణభ్రమం హృది హరిద్దంతావళాః పేదిరే
సోఽయం తుంగతిమింగిలాంగకవళీ కారక్రియాకోవిదః
క్రోడే క్రీడతు కస్య కేళికలహత్యక్తార్ణవో రాఘవః.

మ. చలదూర్ముల్ చెలరేఁగ నీ వెచట సంచారింప మంథాచలా
కులభీమభ్రమణభ్రమం గనె హరిత్కుంభీంద్రసందోహముల్
కలితోత్తుంగతిమింగిలాంగకబళీ కారక్రియాభీల ! యే
వలని న్నిల్తువు రాఘవా ! యిఁక సకూపారమ్ముపై నల్గినన్.

శ్లో. పురో గీర్వాణానాం నిజభుజబలాహోపురుషికా
మహో కారం కారం పురభిది శరం సమ్ముఖయతః
స్మరస్య స్వర్బాలానయనసుమమాలార్చనపదం
వపు స్సద్యః ఫాలానలభసితజాలాస్పద మభూత్.

చ. అమరులసన్నిధిన్ నిజభుజాంతరసారము నుగ్గడించి యు
స్త్రము గుఱివెట్టె రాత్రిపురశాసనసమ్ముఖమందు నామరీ
విమలదృశానుమార్చన లవేలగతిం గొను ఘస్మథన్విదే
హము హుత మయ్యె ఫాలనయనానలలోలజటాలకీలలన్.

శ్లో. వంశభవో గుణవా నపి
సంగవిశేషేణ పూజ్యతే పురుషః
న హి తుంబీఫలవికలో
వీణాదండః ప్రయాతి మహిమానమ్.

తే. గీ. వంశభవుఁ డైన గురుగుణవంతుఁ డైనఁ
బూరుషుఁడు సంగకలననే పూజ్యుఁ డగును
వికలతుంబీఫలం బగువిమలవీణ
మహిమ నేలీలఁ గాంచు నీమహితలమున.

ఛందోదర్పణము - కొన్ని విశేషములు

“ త్రి నే త్రి ”

పైశీర్షికతో నాంధ్రసాహిత్యపరిషత్పత్రిక 46 సం॥ 3, 4 సంచికలలో నశేషముతో నొక వ్యాసము ప్రకటితమైనది. దానిని వ్రాసిన శ్రీభట్టాచార్యగా రనంతునిసంధిగతప్రాసనుగురించియు, మఱికొన్ని యితరవిషయములను గురించియు పరామర్శించినారు. సంధిగతప్రాస విషయములో నాచార్యులవారు పరిషత్పత్రికలోను, భారతిలోను వ్రాసినందువలన రెంటికి సమాధానము పంపవలసివచ్చినందులకు చింతించుచున్నాను.

. ఆపరామర్శలో “నిం బిలిచె” యనుప్రయోగమునుగురించి వాఙ్మయమహాధ్యక్ష, శ్రీవడ్లమూడి గోపాలకృష్ణయ్యగారు వ్రాసిన దానిపై విమర్శ తప్ప మిగిలినవి వీరిస్వంతవిషయములు కావు.

క. ధృవముగ సంధిజనితయా
పవిశేషప్రాస మనగఁ బరగుపకారం
బవిరళవకార మగు న .
య్యవదాఅవపా లెఱుంగ ననగి ముకుందా.

ఈపద్యములో ననంతుడు సంధిచే నేర్పడినవర్ణము ప్రాసస్థానములో నున్నవాసికి మైత్రి కూర్చుటకు లక్షణము చెప్పి యొక్కచో దేశ ‘వ’ కారమునకే లక్ష్య మిచ్చినాడు. లక్ష్య మొకదానికే యిచ్చినను ఆయొక్కటియే తక్కినవానికి నుపలక్షణమని శ్రీభట్టాచార్యగారు వ్రాసినారు. ఇది వీరు క్రొత్తగా జెప్పినదికాదు. విద్వాన్ శ్రీరావూరి దొరసామిశర్మగా రాంధ్రసాహిత్యపరిషత్పత్రికలో (32 సం. 3, 4, 5, 6) ఛందోదర్పణముపై బృహద్వ్యాసము ప్రకటించినారు. ఆవ్యాసములో శ్రీదొరసామిశర్మగారు సంధిగతప్రాసలో ‘వ’ కారము తక్కిన

క, చ, ట, త లకుగూడ నుపలక్షణ మని చెప్పినారు. భట్టాచారిగారు శ్రీదొరసామిశర్మగారివ్యాసములోనివిషయ మెత్తి తాము క్రొత్తగా గమనించినట్లు వ్రాయుట ఆశ్చర్యముగా నున్నది.

క. ప్రథమాంతవిభక్తులపై
గదితము లగుకచటతపలు గసడదవ లగున్
పృథివి నివి గజడదబ లగు
ప్రథమపుమన్న లగు నాంతపదముమీఁదన్.
వాఁడు గనువాఁడు సేకొనువాఁడు డెక్క
లాడువాఁడు దపోనిధి వాఁడు వెద్ద
చిక్కెఁ గరి మొ్రక్కెఁ జెలివాక్కుఁ డక్కు లెట్టి
శౌరిఁ దలచె నిన్ బిలిచె నా సంధు లిట్లు.

(ఛందో. ప్ర. ఆ. వ, 61, 62)

వీటిలో ననంతుఁడు ప్రథమమీఁదికచటతపలకు గసడదవలు వక్కాణించినాఁడు. చిన్నయసూరి చెప్పినట్లు "తెలుఁగులమీఁదిం సాంస్కృతికపరుషములకు గసడదవలు రావు" అన్నవిషయము అనంతుఁడు చెప్పలేదు. పైగా "వాఁడు దపోనిధి" అని యుదాహరించి తెనుఁగుల మీఁదిసాంస్కృతికములకుఁ గూడ గసడదవ లగు నని స్పష్టపరచినాడు. ఈవిషయమును గూడ శ్రీరావూరిదొరసామిశర్మగారు తమసమీక్షలో తెలియపరచినారు. వారు వ్రాసినవిషయమునే తిరిగి వీరుసంగ్రహించి వ్రాయుట 'మరింత' ఆశ్చర్యకరముగానున్నది. ఆచార్యులవారు ఆంధ్రసాహిత్యపరిషత్పత్త్రిక సం. 45 సం. 3 లోను, భారతిలోను శ్రీరావూరి వారి సమీక్షలోని రెండువిషయములను విమర్శించుట చూడగా వీరు రావూరివారిసమీక్షను జూచినట్లు తెల్ల మవుచున్నది.

"తెలుగులమీఁద సాంస్కృతికపరుషములకు గ స డ ద వ లు రావు" అనిచిన్నయసూరి చెప్పినాడే కాని యతనిమాట మనభాషాచ

రీతికే విరుద్ధముగా నున్నది. తెనుగులమీద సాంస్కృతికపరుషములు రావట మనెడిది యే కాక అనలుగసడదవాదేశ మనెడిది ప్రాచీనవాఙ్మయములో నిత్యముగా కన్పడుచున్నదనియు, ఈసందర్భంలో దెనుగు, సంస్కృత మనివిచక్షణ లేదని కీ. శే శ్రీచిలుకూరినారాయణరావుగారు తమఆంధ్రభాషాచరిత్రలో సోదాహరణముగా విపులీకరించినారు. ప్రాసలలో లేనిప్రయోగాలను, ఆధునికపరిష్కర్తలుచిన్నయసూరినికొలబద్దగా బెట్టుకొని, వందలు, వేలు, ప్రయోగాలు దిద్దివేసినను తెనుగులమీది సాంస్కృతికాలకు గూడ గ స డ ద వ లు నిత్యమే నని ప్రాచీనశాసనభాష ఘోషించుచున్నది.

అనంతుడు "వాడు దపోనిధి" అని యుదాహరణ మిచ్చుటకొన్నియెడల తెలుగులమీది సాంస్కృతిక 'కతపలుకు గదవలు' కానంబడియెడి "అనప్రౌఢవ్యాకర్తకు ప్రోద్బలక మవును గానిప్రౌఢవ్యాకర్తమాత్రము అనంతునికిప్రోద్బలక మగుననుట పొరపాటు.

ఇంక నిన్ బిలిచె "విషయము. దీనివిషయములో వాఙ్మయమహోద్యక్షులు సాకల్యముగా విమర్శించియే వ్రాసినారు. "ప్రథమపుసున్న లగునాంతపదములమీదగ "అన్నపాదము శ్రీఆచార్యులవారికి అన లర్థమేకాలేదు. నాంతపదములమీదగ =నకారాంతములైనపదములమీద, ఇవి—ఈ క చ ట త ప లు, గ జ డ ద బ ల గు న్= నరళములగును. ప్రథమపుసున్న లగున్=మొదటసున్నలును, అగు, ఆగజడదబలమొదట ద్రుతమునకు సున్నవచ్చు ననుట.

చిక్కెఁ గరి మొదలైనవి అరసున్నలు గలవానికి నుదాహరించినాడు కాన అనంతుడు 'సున్న' అని పేర్కొనుటచేత, అరసున్న, నిండుసున్న రెండును గ్రాహ్యము లగును కదా! అని 'నిం బిలిచె' అనిపొరపాటున పూర్ణబిందువురూప ముదాహరించియుండు నని శ్రీవజ్ఝలమూడివారి అభిప్రాయము. "నాంతపదములమీదగ" అనుదానికి "ప్రౌఢ

మవుసున్న లగు” ననునది విశేషణముగా జెప్పవలయునుగాని క్రియగా జెప్పకూడ దని శ్రీఆచార్యులవారు పేర్కొనినారు. ఇది చాల ప్రమాద భూయిష్ఠ మైనవాక్యము. “ప్రథమవుసున్న లగు” ననునది విశేషణ మైన నాంతపదములు అనగా ద్రుతాంతపదములు మొదట అనుస్వారాంత పదము లని అనుస్వారానికే ద్రుతమాదేశముగా వచ్చు నని తలక్రిందులవ్యాఖ్యానము చెప్పుకోవలసి వచ్చును. ప్రథమవుసున్న = మొదటి సున్నలగునటువంటి, నాంతపదములమీఁదఁ = ద్రుతప్రకృతాలమీద, ఇవి=ఈకచటతపలు, గజడదబలగుఁ=సరళము లగును అని చెప్పవలసి వచ్చును. ఇట్లు చెప్పికొనిన నాంతపదాలకు ముందున్నసున్న వచ్చునని యనిన ద్రుతము బిందువు అగు ననియు, అట్లు ద్రుతము బిందు వయిన తరువాత కచటతపలు, గజడదబ లగు నని విపరీతార్థము వచ్చును. దీని వలన పరుషాలు, పర మగుచున్నపుడే ద్రుతానికి బిందువు చేసుకోవలసి వచ్చును. ఇది యెంత ప్రమాదభరితవిమర్శయో విజ్ఞులు గమనింపగలరు.

“నిం బిలిచె, నం బిలిచె, తం బిలిచె” వంటిఅసిష్టము లైనపూర్ణ బిందురూపములను చిన్నయసూరిగాని, ప్రౌఢవ్యాకర్తగాని నిషేధించి యుండలేదు. నిన్ను, నన్ను. తన్ను అనినప్పుడు “అకారంబుకిందిఁ ఆగా రంబునకు “ఇత్యాదిసూత్రముచేత (బాలవ్యా. ప్రకీ. ప 7 సూ) ద్విత్వ లోపము రాగా, నిను, నను, తను అనెడిద్విత్వరహితరూపములు సిద్ధించును. అనంతరము “పదాంతంబులై యసంయుక్తంబు లైన “ఇత్యాది సూత్రంచేత (బాలవ్యా. ప్ర. ప. 16 సూ) ఉత్వలోపము వచ్చి నిఁ, నఁ, తఁ అనెడి రూపములు బాలవ్యాకరణముప్రకారము సిద్ధించును. వీనిమీఁద ‘పిలిచె’వంటిపరుష మాదిలో గలపదములుపరమయిన “ద్రుత ప్రకృతిమీఁద పరుషములకు సరళము లగు”అనుసూత్రముచేత సరళాదేశము వచ్చి, “ఆదేశసరళములకు ముం దున్నద్రుతమునకు బిందుసంశ్లేషలు విభాష నగు”అనుసూత్రముచేత పూర్ణబిందువు వచ్చిన “నిం

బిలిచె, నం బిలిచె, శం బిలిచె"వంటి అనిష్టరూపములు సిద్ధించును. ఈసందర్భములో పొల్లునకారమునకు బిందు వేమిటి యని సందేహించె దరేమో! ఆయలవాటు చిన్నయసూరికి నున్న దే కాని లేనిదికాదు. "కందోయి" బిందురూపమును చేయునపుడు కన్+దోయిస్పష్టముగా పొల్లునకారమునే చూపించినాడు. అనగా పొల్లునకారమునకు బిందువు చేసె ననుటలో సందేహ మేమియుండును? కాదు కూడ దనుకొనిన ద్విత్వలోపము వచ్చిన 'నను'వంటిరూపములలోనే (నను+పిలిచె అని నపుడు) ఉత్వవిశిష్టనకారమునకు పూర్ణబిందువు చేసుకోవలసివచ్చును. వ్యవస్థితవిభాషచే నీద్రుతమునకు పూర్ణబిందువు లే దని నిషేధము చెప్పుకొని "నం బిలిచె, నిం బిలిచె"వంటిరూపాలు అసిద్ధాలు చేసుకొనవచ్చు ననెదరు కొందఱు వ్యాఖ్యాతలు. అది వ్యాఖ్యాతలహృదయమే యనిపించుకొనును గాని చిన్నయహృదయ మనిపించుకొనదు. సమాసములో లుప్తశేషములకు ఆగమముగా వచ్చిననకారమునకు సంశ్లేష లే దని చెప్పనే చెప్పినాడు. 'నం బిలిచె'వంటిరూపాలు తాను నిషేధించవలసినఅవసర మున్న దనెడిసంగతి చిన్నయసూరి మఱచిపోయినాడు. వ్యవస్థితవిభాషచేత నేను, తాను పదాలలోని ద్రుతాలకు గూడ సంశ్లేష నిషేధించుకోవచ్చుగదా! "నేను తాను పదంబుల ద్రుతంబునకు సంశ్లేషంబు లేదు"అని ప్రత్యేకముగా సూత్రమును సృష్టించుకోవలసిన అవసర మేమున్నది? దీనిని చెప్పుట స్పష్టార్థముకొఱ కనెదరు వ్యాఖ్యాతలు. అటులనే స్పష్టముగా "నం బిలిచె, నిం బిలిచె" ఇత్యాదులలో బిందునిషేధము చెప్పవచ్చుకదా! అసలు చిన్నయసూరి 'నం బిలిచె'వంటిరూపాలను నిషేధింపవలసినఅగత్య మున్న దని గుర్తించలే దని ఆరూపాలు, ఆయాసూత్రాలరచనాకాలములో అతని దృక్పథములో పడలేదని, బిందుసంశ్లేషలు విభాషగా విధించినందువలననే నేను, తాను పదాలలోని ద్రుతాలకు సంశ్లేష వచ్చి, అనిష్టరూప

సిద్ధి అవుతున్న దని అతనికి గోచరించి వెంటనే నిషేధించినా డని తోచుచున్నది. ప్రౌఢవ్యాకర్త కూడ శబ్దపరిచ్ఛేదములో నిన్ను, నన్ను, తన్ను ఇత్యాది 73 వ సూత్రముచేత నిఁ, నఁ, తఁ అను రూపాలనే సిద్ధింపచేసినాడే కాని వాటిదుత్వానికి ఆదేశసరళము పరమయిన పూర్ణబిందువునిషేధము చెప్పవలసినఅగత్యమును గుర్తించ లేదు.

ఇంతకు సంస్కృతవ్యాకరణాలచేత సాధ్యముకానటువంటియు, ఇంతవఱకు నాంధ్రవాఙ్మయములోనే కనిపించని, తడ్లిల, (తల్లిలకు) వంటివికల్పరూపమును సృష్టించిన అనంతుడు 'నిం బిలిచె' విషయములో భ్రమపడినాడు అనుటలో నాశ్చర్య మేమున్నది?

అచేతనద్వితీయ:—

ఆ. వె. ఆ యచేతనద్వితీయ దా నిజరూప
మయ్యు నుండు ప్రథమయట్టు లుండు
క్రతువు గాచె దాశరథి కృష్ణు డొక పర్వ-

అనేపద్యములో "క్రతువు కాచె" అనుదానిని "క్రతువు గాచె" అని శ్రీగోపాలకృష్ణయ్యగారు సవరించుకొను మనిరి. శ్రీ ఆచార్యుల వారు "ప్రథమువిూదిపరుషములకు గసడదవలు బహుళంబుగా నగు"అనుచిన్నయసూరిసూత్ర ముదాహరించి గసడద వాదేశము రాని రూపము కూడ నుండవచ్చుననినారు. వీరికి బాలవ్యాకరణము తప్ప మఱొకటి వచ్చినట్లు గన్పడదు. ఛందోదర్పణ మైనను వీరు గట్టిగా జదువుకొనినట్లు కనపడదు.

కం. ప్రథమాంతవిభక్తులపై

కథతము లగుకచటతపలు గసడదవ లగుఁ అని అనంతుడునిత్యముగా జెప్పినసంగతి వీరికి తెలియదు. శ్రీగోపాలకృష్ణయ్యగా రనంతు నిలక్షణములోనే యనంతునిప్రయోగము కొలువగా వీరు బాలవ్యాకర

ణముతో ననంతునిప్రయోగమును గొలిచి దోషములేనిచోట దోషము పట్టవచ్చినారు.

ద్విత్వము:- ఇందులోవీరువ్రాసినవిశేష మేమియు లేదు. అనంతుడన్యహల్ సంయుక్తాలనుసహితముద్విత్వముగా జేకొ(ౘ)నుటగురించి శ్రీగోపాలకృష్ణయ్యగారు 1952ఆగష్టు సుభాషిణిలో దెలియజేసినారు. ఒక్కయనంతుడే కాదు, అప్పకవివంటివారు కూడ విజాతీయాక్షరముల కలయికను ద్విత్వ మని జడ్డయని వ్యవహరించినట్లు తమధ్వని,లిపి,పరిణామము 94 వపుటలో శ్రీగోపాలకృష్ణయ్యగారు వివరించినారు. సుభాషిణినుండి సంగ్రహించి వీరు మఱల వ్రాసి లోకమును దా మేదో క్రొత్తగాగనిపెట్టినట్లు భ్రిమపెట్టుచున్నారు.

"లలి నతద్వ్యంజనంబుపై లత్వమునకు
ద్విగతి తల్లీల యనగ తద్లీల యనగ"

అనునపు డనంతుడు తోర్లి యనుపాణినీయసూత్రమునకు భిన్నముగా వికల్పరూపములను వచించుట విశేష మని శ్రీవడ్లమూడివారు 1952 సెప్టెంబరు సుభాషిణిలో వ్రాయగా దానిని కాపీ చేసి తాముక్రొత్తగా జెప్పినట్లు వ్రాసుకొనినారు. ఈ "కాపీ"తొందరలో "సిద్ధాంతకౌముది కారుడు పాణిని" యని వ్రాసి పల్లటీ కొట్టినారు. శ్రీగోపాలకృష్ణయ్య గారు వ్రాసినసంగతు లే తాము "కాపీ" చేసి వ్రాసి యావిషయము మధ్య నీవిషయము మధ్య మధ్యన దూర్చుట యెందులకు ? "తల్లీల, తద్లీల" వికల్పరూపముల ననంతుడు విశేషముగా జెప్పిన ట్లొక్క"సుభాషిణి"లోనే కాదు. 1953 వ సంవత్సరములో బ్రకటింపబడిన శ్రీదేవినేనిసూరయ్యగారి దివ్యప్రభావకిరణసహిత మైనఆంధ్రభాషాభూషణమునకు శ్రీగోపాలకృష్ణయ్యగారు వ్రాసినపీఠికలో సహితము (134, 135 పుట) వివరించినారు.

ఇంక "దశరథాత్మజుడు స్వామి ధాత్రికి" ననుచోట "డుస్వామి" యని తగణముగా ననంతుడు వేయుటను శ్రీరావూరిదొరస్వామిశర్మగారు సాహిత్యపరిషత్పత్రిక 32 వ సంపుటములో బ్రకటించినవిపులసమీక్షా వ్యాసములో వ్రాసి యాలక్ష్యములోనున్న వైపరీత్యమును వారేఖండించి నారు. వారు వ్రాసినవిషయమును 'వీరు' కాపీచేసివ్రాయుటచాల గొప్పవిష యము. వీరి విజ్ఞానమునకుదోడు గిడుగుసీతాపతిగారికిప్పై విమర్శయా ? వీరుచెప్పినట్లు "రేఫయుతయతి" యనునది ప్రత్యేకయతి కాదు. "ఆంధ్రి లిపి జొప్పడదు రుకారాన్వితంబు'' అనుపద్యములో ననంతుడు శబ్ద స్వరూపనిర్ణయము చేసినాడు. మ్రుచ్చు, స్రుక్కు, క్రుమ్మ్రు వంటి పదా లలో రేఫమునకే యతి వేయవలయునుగాని వట్రుసుడికి గాదని పేర్కొనినాడు. పూర్వకాలమున నుచ్చారణమునకు లోనై పండితులు మృచ్చు, గృచ్చు, వలె నచ్చతెనుగుపదములలో సైతము వట్రుసుడిని వ్రాయుచుండెడివారు. అట్టివ్రాతలు చూచిన అనంతుడు వట్రుసుడిని వ్రాసినచో "ఇఈ, ఎఏ, లకు రి,రీ, రె,రే" లకు యతి చెల్లవలసివచ్చు నని యాలోచించియే యందు వట్రువసుడి లేదుసుమా యని చెప్పు టకు నది రేఫయుతపదమనియు, దానికి రేఫయుతయతియే చెల్లుననియు చెప్పినాడు. ఇక్కడ రేఫయుతయతి అనగా నొక ప్రత్యేకయతి యని కాదు. 108 పద్యములో జెప్పిన సంయుక్తయతిలో నిది యంతర్భూత మైనదే. భ్రమప్రమాదనివారణకు, శబ్దస్వరూప మిట్టిది యని నిర్ణయము నకుమాత్రమే చెప్పిన దీపద్యము. ఇట్టిశబ్దస్వరూపనిర్ణయమునే ప్రథ మాశ్వాసము .57 వ పద్యములో గూడ జేసి చూపినాడు. ఆ 57 వ పద్యములో సంయుతప్రాస యనినాడు కదా యని దానినికూడ నొక ప్రాసగా లెక్కింపలేదు. దీనినిగురించి శ్రీగోపాలకృష్ణయ్యగారు "ధ్వని, లిపి, పరిణామము"లో 75, 76, 77, 78 పుటలలో విపులముగా జర్చించి నారు. 'దియతి' యనునది ప్రత్యేకముగా యతి లేదు. అది భిన్నయ

తిలో నంతిర్భూతము. నిజమునకు భిన్నయతియు నొక్కయతిగా లెక్కింపదగినది కాదు. అనంతుడు 24 యతులు చెప్పె ననుటకు నతనిగ్రంథమున నాధార మేమియు లేదు అప్పకవి చెప్పినమాట తప్పు. అనంతుని ఛందము నేటిముద్రితప్రతి తిన్నగా లేదు. దానిని పరిష్కరించి పునర్ముద్రణ చేయవలసినయవసరము చాల కలదు.

ఎవ ఒఓ ల విషయము:— ఉచ్చారణలో కారపరిత్యాగము రానప్పుడు హ్రస్వమునకు దీర్ఘము వచ్చు నని యట్టిదీర్ఘము చేసినప్రయోగములే కవిజనాశ్రయకర్తమున్నగువారు కావించినారని శ్రీగోపాలకృష్ణయ్యగారు ఆం. సా ప. ప 39 వ నం 1, 3, నంచికలలో వివరించినారు. ఈవిషయమునుగురించి శ్రీఆచార్యులవారు చెప్పిన గొప్పవిషయమేమియో తెలియదు. "అ,ఆ,ఇ ఈ,ఉఊ" అనునపుడు ద్వితీయాక్షరములు ద్విత్వాక్షరములవలె నుచ్చరింపబడును కావున వానిముందున్నహ్రస్వములుగురువులగునని జయంతిరామయ్యపంతులుగారువ్రాసినవిషయమును నావ్యాసములో శ్రీగోపాలకృష్ణయ్యగారు ఖండించిరి. ఆవ్యాసములో వారు ఖండించినజయంతివారివిషయమును, ఛందోదర్పణోపోద్ఘాతములోసీతాపతిగారు చెప్పినవిషయము నీఆచార్యులుగారు కాజేసి తేలుకుట్టినదొంగవలె బయటపడినారు. జయంతిరామయ్యగారు వ్రాసినవి కవిజనాశ్రయ (1917 సంవత్సరముద్రణము) సంజ్ఞాధికారము 19 వ పుటలో "ఫుట్‌నోట్సు"లో నీవిషయము వ్రాయగా మనయాచార్యులవారు (223పుటలో) "శ్రీజయంతిరామయ్యపంతులుగారును పైవిషయమునే మఱియొకవిధముగా జెప్పి యనంతుడు ప్రయోగించిన 'ఎఒ' లనేనమర్థించిరి. "యని వ్రాసినారు. ఈవాక్యములవలనశ్రీభట్టాచార్యులవారు కవిజనాశ్రయమునెుగమైనను చూడలే దని యర్థమవుచున్నది. శ్రీజయంతివారు కవిజయనాశ్రయకర్తృప్రయోగమునుగురించి కవిజనాశ్రయ

ములో వ్రాయుగా ననంతుడు వ్రాసిన "ఏ౽." లనేనమర్థించిరి యని యాచార్యులవారు వ్రాసి నా రేలకో! జయంతివా రనంతునిసంగతినేల యెత్తినారు? యెక్కడ యెత్తినారు? వీరు కవిజనాశ్రయమే చూడలేదు కదా! ఇంక వీరికి జయంతివారు రెండవయచ్చునకు ద్విరుక్తోచ్చారణ మున్నట్లుచెప్పినసంగతి యెట్లు తెలిసినది? శ్రీవడ్లమూడివారు తమ వ్యాసములోజయంతివారు వ్రాసిన విషయమును ఖండించగా నావిషయమును వీరా వ్యాసమునుండియే సంగ్రహించి కవిజనాశ్రయములో వ్రాసినారనిన సంగతి మఱచిపోయి యసలురహస్యము బయటపెట్టినారు. శ్రీవడ్లమూడివారు సాహిత్యపరిషత్పత్రికలో "అలఘుచతుస్సంధ్యక్షరములలో (1ఆ3ప) "తనరగ అ, ఆ, ఇ, ఈ" (4 ఆ 109 ల) "అ ఆ లై ఔ లకు మైత్రి" (కవిజసంజ్ఞ) అని 3 పద్యాలనుదాహరింపగా (చూ. ఆం. సా. ప. పత్రిక 39 వ సం 1, 3, సం 5, 6, 7పుటలు) నాపద్యములలో నుండియేకవిజనాశ్రయపద్యమును ఛందోదర్పణము నాల్గవయాశ్వాసము 109 వ పద్యము నాచార్యులవారు తాము గొప్పగా గనిపెట్టినట్లు "అనంతుడా యొకపద్యముననే కాదట్లుచెప్పినది చూడుడు" అనివ్రాయుట యెందులకో? శ్రీగోపాలకృష్ణయ్యగారు "అలఘుచతుస్సంధ్యక్షర" యనే పద్యము నొకదానినే చూచినారు. తక్కినవానిని చూడలేదని భ్రమ కలిగించుటకా? ఇంక వీరు చెప్పిన గొప్పవిషయమేమిటి? శ్రీజయంతిరామయ్యగారు, సీతాపతిగారు. వ్రాసినవిషయమునే సమర్థించుచున్నా నని చెప్పుటకుమాత్రము తామే ఈవిషయమును కనిపెట్టినట్లును దమయభిప్రాయమునే శ్రీరామయ్యపంతులుగారు శ్రీసీతాపతిగారలు సమర్థించినటులు వీరువ్రాయుటచాల గొప్పవిషయము. అది వారి గొప్పతనము. వాస్తవ విషయమునకు వత్తము.

కవిజనాశ్రయఛందోదర్పణపద్యములలో "అ, ఆ, ఐ మొలకు-తసరగ అ, ఆ, ఇ ఈలనగ" వంటిచోట్ల రెండవయక్షర మూదబడునని శ్రీసీతాపతిగారు, ద్విత్వమువలె నుచ్చరింపబడు నని శ్రీరామయ్యగారు వ్రాసినారు. హల్లునకు ద్విత్వోచ్చారణ ముండును గాని యచ్చునకు ద్విత్వోచ్చారణ మేమిటి? జంటయక్కరముల నుచ్చరించునపుడు ఆద్యక్షరమునకుసహితము దీర్ఘము చేసి యుచ్చరించుట నేటికి లోకములో ననుభవములో నున్నది. అనంతుడా పద్యములోనే కాక మఱికొన్నిచోట్లకూడ కారప్రత్యయమురానపుడు దీర్ఘము చేసి ప్రయోగించినాడు. "రావొలంగి సమస్తాక్షరములమీద" (4 ఆ 128 ప) నజాయనవిశ్రమ వేళ (1 ఆ 117 ప) కా మొదలు క్షకారముతుద (4 ఆ 123 వ) ళాదొలగి మైమపమ లగు (4 ఆ 127 ప) అని యొక్కచోట గాదు నాలుగు చోట్ల 'కారప్రత్యయము' చేయక దీర్ఘము చేసి ప్రయోగించినాడు. ఏకాక్షరములకే తప్పజంటయక్షరములకు దీర్ఘము రాదని యాచార్యుల వారిక్రొత్త వ్యాకరణనియమము కాబోలు! కవిజనాశ్రయములో దక్కత్త

పాఫా బా భామాలను
పాపాక్షరసంజ్ఞ శేను బద్యము మొదలన్
రూపించి నిలిపి చెప్పిన
నావద్దశలకును మూల మగ్రు కవీంద్రుల్.

(సంజ్ఞ ప 53 ప 1917 ముద్ర)

అనెడిపద్యములలో "పాఫా బా భామా" లని యాచార్యులవారు కోరుకున్న ట్లొకజంటకే కాదు రెండుజంటలకు నైన మఱియొకయక్షరమునకుగూడ దీర్ఘము చేసి ప్రయోగించినాడు. ఇచటహ్రస్వములకే గ్రహణకాని దీర్ఘములకు గాదు. నేటికినిలోకములో "సేకు పఫలు వచ్చినవా?" యని యడుగుసలవాటు లేదు. "పా, ఫా"లు వచ్చినవా? యని దీర్ఘము

చేసి యడుగుటయే యున్నది. దీనితో నాచార్యులవారిజంటలబెంగ తీరిపోయెనా? ఇతరులువ్రాసిన పాతవ్యాసములలోనివిషయములనే యుపహరించి యాచార్యులవారు వ్యాసములు వ్రాయుచున్నసంగతిని శ్రీగోపాలకృష్ణయ్యగారు ఆం. సా. ప. పత్రిక 5 వ సంచికలో విజ్ఞప్తిరూపమున నాపత్రికాసంపాదకులదృష్టికి తెచ్చినను దిరిగి వీరి యపహరణవిషయపూర్ణవ్యాసములను మఱల మఱల యెందులకు ప్రకటించుచున్నారో బోధపడకున్నది.

లిపిసమస్య

శ్రీమాన్ కొమాండూరి శఠకోపాచార్యులుగారు, ఎమ్.ఎ., బి.ఎల్.,

ఆంధ్రభాష కిప్పుడు వాడుకలో నున్నలిపిని అచ్చుటైపు ఇత్యాదుల కెక్కువనుకరముగను, కన్నడలిపితో కలియుటకును సంస్కరించి మార్చుట కొకయుద్యమ మిటీవల బయలు దేరినది. కర్నాటకమున నిట్టిప్రయత్న మిదివరకే జరుగుచున్నది. మన దేశపుభాషలలో తెలుగు మాట్లాడువారు సుమారు 3½ కోట్లమంది. కనుక, హిందీతరువాత దీనికి రెండవస్థాన మున్నది. కన్నడభాషీకులు సుమారు రెండుకోట్లమంది. కనుక, ఈరెండుభాషల కొకేలిపి నేర్పరచుచో 5½ కోట్లజనులకు ఏకలిపి యుండును. పూర్వకాలపుశిలాలిపులను, తామ్రశాసనముల లిపిని పోల్చినచో, ఆంధ్రకర్నాటముల కొకప్పు డొకేలిపి యుండినట్లు తోచును. ఈనాడు కొంతభేద మున్నది. కనుక ఒకేలిపి యేర్పడుటకు ఈరెంటిలోను కొలదిసంస్కరణలు చేయవలెను. మరియు, ఈకాలమున అచ్చుటైపుయంత్రములవాడుక చాల పెరుగుచున్నది. వాటియుపయోగముకై, గుణితముల చేర్చుటవలన కల్గుచున్న సంఖ్యాధిక్యమును క్లిష్టతను పోగొట్టుటకును, వాటిలో సంస్కరణ మావశ్యకమే. ఈ లిపులను బోలియున్న దేవనాగరలిపిలోను ఇట్టిసంస్కరణల చేయుటకు విజ్ఞులగువిద్వాంసులసమితి యేర్పడి, కొంతపరిశోధన జరిగినది. కొన్నిమార్పులు సూచింపబడినవి. వర్ధా ఇత్యాదులలో కొంద రిట్టి సంస్కరణలను కొంతవాడుకకు తెచ్చినారు. ఉత్తరప్రదేశపుప్రభుత్వమువారు అధికారపుహోదాలో ఈసంస్కరణల కొన్నిటిని గుర్తించి, విద్యార్థుల పాఠ్యగ్రంథాలను ఇట్టిమార్పులు గలలిపిలో నచ్చువేయించినారు. కాని, అక్కడను, ఈసంస్కరణ ఆరంభస్థితిలోనే యున్నది. మరియు, ఈలిపిసంస్కరణ కూడ దని కొందరును, ఆరీతిగ కాక మరొకరీతిగ

మార్పవలె ననికొందరును ఆందోళన చేయుచు ఈసంస్కరణోద్యమమును ప్రభుత్వప్రయత్నమును ప్రతిఘటించుచున్నారు. ఇట్లే ఆంధ్ర కన్నడలిపుల మార్పుసూచనలగూర్చియు, చర్చయు ప్రతిఘటనయు కల్గుచున్నవి. మార్పులేవియు కూడ దనుపక్షపువా రెప్పుడు నుందురు. ఈరెండులిపులలో నిప్పు డున్న భేదము స్వల్పమే. అయినను ఎట్టిమార్పులు చేయవలెను? "కన్నడపులిపి నిర్దుష్టము నవ్యమును; అందులో నంతగ మార్పు చేయకూడదు; కొద్దిమార్పులతో దానినే ఆంధ్రు లవలంబించవలె న''ని కన్నడప్రాంతీయుల సూచన. ఎవరిలిపి వారి కందముగ నవ్యముగ నున్నట్లుతోచుట సహజము. ఈరెంటిసమీకరణ ఆంధ్రులకును ఇష్టమే. అందునిమిత్తం తెలుగులిపిలోనే హెచ్చుమార్పులు చేసి, దాదాపు కన్నడలిపినే సామాన్యలిపిగ నంగీకరించుటకు ఇక్కడజనాశయ మెట్లుండునో! చాలమంది ప్రతిసూచనల జేయవచ్చు. మున్ముందుగాని ఈవిషయ మింకను వ్యక్తం కాదు.

ఇది యిట్లుండ మరొకపెద్దసమస్య కలదు. మనదేశమున 14 సాహిత్యభాషలు వాడుకలో నున్నవి. వాటిని ప్రభుత్వరాజ్యాంగంలోను గుర్తించియున్నారు. వాటిలో సంస్కృతం, హిందీ, మహారాష్ట్రం, ఈమూడింటికిని దేవనాగరలిపినే వాడుదురు. తక్కినభాషలన్నిటికి వేర్వేరులిపు లున్నవి. ఒకేదేశము ఒకేసాహిత్యభాష. అందు ఒకేలిపియు ఉండుట ప్రజాసామాన్యముకు ప్రభుత్వముకు గూడ సుకర మగును; కాని, భాషవిషయంలో మనదేశపుప్రత్యేక స్థితినిబట్టి, ఈ 14 భాషలకును ఏకీకరణము కుదర దనుట స్పష్టము. మనదేశములోని మన్యప్రాంతాలలో గిరిగహ్వరాలలో ఆదిమజాతుల జనులు విడిగ కొన్నివందలభాషలను మాట్లాడుకొనుచున్నారు. కాని వాటిలో వేటికిని వేరుగ సాహిత్యముగాని, ప్రత్యేకలిపిగాని లేదు, క్రైస్తవమతం వ్యాపింపజేయుటకై మిషనరీలు పాఠ్యగ్రంథముల నిటీ

వల వ్రాసి, రోమను (=ఆంగ్ల) లిపిలో అరచనల నచ్చు వేయించినారు. ఈఆటవికజనులు నాగరికులయి, మైదానప్రజములతో కలసిమెలసి యుం డుకాలము త్వరలోనే రాగలదు. అప్పుడు వారలు తమతమ ప్రాంతపు సాహిత్యభాషలను నేర్చుకొందురు. (ఉ॥ మనమన్యపుకోయవారు చాల మంది తెలుగు మాట్లాడగలరు.) కనుక, కాలక్రమమున ఈయాట వికభాషల వాడుక తగ్గుచు, అవి కొన్నిశతాబ్దులకు ఖిలమయిపోవచ్చు. కాని, ఈ 14 సాహిత్యికభాషలుమాత్రం ఆయాప్రాంతాలలో స్థిరముగ నుండునవే. దేశమంతటిసాకర్యముకు జాతీయైక్యముకును, ఒకేసామా న్యభాష యుండవలె నని ఇప్పుడు బహుజనములును సర్కారును గుర్తిం చినారు. ఆస్థానమును జాతీయమహాసభవారును, రాజ్యాంగనిర్మాత లును ఏకగ్రీవంగా హిందీభాష కిచ్చినారు. దానికి దేవనాగరలిపిని నిర్ణయించినారు. ఈమాన్యభాష వ్యాప్తివల్ల తెలుగు తమిళం వంటి 12 ప్రాంతీయభాషలప్రచారము కెట్టిహానియు ఉండదు; ఉండకూడదు కూడ. ఇప్పుడు దాదాపు మనదేశమంతట భాషాప్రయుక్తరాష్ట్రము లేర్పడి యున్నవి. ఆయాప్రాంతాలభాషలలో మంచిసాహిత్యము నిర్మిత మయి, ఈ 12 భాషలును వృద్ధి నొందుచున్నవి. కనుక, ఈప్రాంతీయ భాషల ఉచితస్థానము కెట్టిభంగమును లేకుండనే, ఐక్యముకై సామా న్యజాతీయభాష యాదరింపబడును.

లిపిసమస్యలోమాత్రం కొంతభేద మున్నది. ఆంధ్రకన్నడముల మధ్య పోలిక యున్నట్లే, నాగరికి గుజరాతికిని, నాగరికి బెంగాలికిని పోలిక కలదు. ఆంధ్ర కొకకన్నడంతోనే గాక, తమిళమహారాష్ట్ర, హిందీఓఢ్రప్రాంతాలతోను పొరుగు కలదు. ఇట్టిపొరుగు ద్విభాషిక మండలాల జనులు కొందరు పొరుగుభాషలను వాటిలిపులను నేర్చు కొనుసందర్భమును, ఆవశ్యకతయు గూడ కలదు. ఒక్కొకపొరుగుభా షతో బాటు, దానిప్రత్యేకలిపినిగూడ నేర్చుకోవలసినందుననే భాషా

ఖ్యానము చాల కష్టమగుచున్నది. సాధారణముగా బ్రిటను, జర్మనీ, రష్యా, జపాను, చీనావంటి ఒక్కొకమహాదేశమంతటి కొకేలిపి వాడుకలో నున్నది. అంతేగాక, యూరపులో బ్రిటను, ఫ్రాంసు, జర్మనీ మున్నగుదేశములలో ప్రత్యేకభాషలే యున్నను దాదాపు యూరపు ఖండమంతటను, ఈభాషలన్నిటి కొకేలిపిని వాడుకొనుచున్నారు. ఈ రోమనలిపియే అమెరికాలోని అన్నిభాషలకు వాడుకలో నున్నది. కనుక ప్రతిభాషకు ఒకప్రత్యేకలిపి యుండు ఆవశ్యకత లేదు. అనేక భాష లున్నను వాటికొకేలిపిని వాడుటయే ఉచితము. అది జాతీయ క్షేమముకు అన్యోన్యసౌహార్దముకును సహాయకరము.

మన దేశపు ప్రత్యేకపరిస్థితినిబట్టి, అందరిదీ ఒకేప్రాచీనసంస్కృతియగుటబట్టియు, జాతీయైక్యపు ఆవశ్యకతనుబట్టియు గూడ, ప్రాంతీయభాషతోబాటు సామాన్యభాషనుగూడ అన్నిప్రాంతాల సెకండరీ స్కూళ్ళలో బోధించుచున్నారు. ఈ భాష లన్నిటితో వేర్వేరులిపులనుగూడ నేర్పుటవల్ల విద్యార్థులశ్రమ, ఉపాధ్యాయుల శ్రమయు, హెచ్చుచున్నవి. (ఉ॥ తెలుగు తమిళము ఒకేద్రావిడభాషనుండి జనించిన సోదరభాషలు; కాని, తమిళముకు ప్రత్యేకలిపి యున్నందున లిపినిమిత్త మెక్కువ కష్టపడవలెను. ఇట్లే జాతీయభాష హిందీయు, మనసంస్కృతి కాకరమగు సంస్కృతమును అవశ్యం నేర్చుకోదగిన వయినను, అందుతో దేవనాగరలిపిని గూడ అభ్యసించుటకు శ్రమ హెచ్చుచున్నది.

ఇట్లు ఒక దేశములో వేర్వేరు లిపులందు మమకారమువలన సాంఘికవిభేదము, అందుతో రాజకీయకలహములును పెరుగుచున్నవి. ఉ॥ పంజాబురాష్ట్రములో పశ్చిమభాగములో పంజాబీభాషయు, మిగిలినప్రాంతమున హిందీయు వాడుకలో నున్నవి. ఈ రెండుభాషలలో నూటికి 90 వరకు ఒకే పదజాలము. అంకెలు, అవ్యయము, క్రియల

లోను భేద మంతగా లేదు. కాని, లిపులు ఈ రెంటికీ భిన్నములు; ఆకారణమున వేరుభాష లనబడుచున్నవి; ఇట్లే హిందీ ఉర్దూలమధ్య పరిస్థితి దాదాపు యిట్టిదే. ఉర్దూలిపి కేవలం భిన్నమయివది; లేకుంటే రెండును ఒకే హిందూస్తానీభాషకు శాఖలగును; ఇట్లే, తమిళముకు మలయాళము అతిసన్నిహితము; కాని, ప్రత్యేకలిపి సంస్కృతపదముల హెచ్చువాడుకయు భేదకారణము లయినవి. పంజాబులో సిక్కులు ప్రత్యేకపంజాబీరాష్ట్రము కోరుటకును, ఉత్తరప్రాంతపు ముస్లిములు ఉర్దూభాషకు ప్రత్యేకసదుపాయముల కాందోళన చేయుటకును, లిపి భేదము ముఖ్యకారణమయినది. అనగా, అనైక్యము పెరుగుచున్నది. మనదేశపుభాష లన్నిటికొకేలిపి యేర్పడిన, మనము పొరుగుభాష లను సులభముగ నేర్చుకోగల్గుదుము. మరియు, సాంఘికవిభేదాలు తొలగి మైత్రి బలపడును; జాతీయైక్యము కల్గును. ఇట్టి యుద్యమము కవకాశ మున్నది. ఇప్పటి మనభాషలకు ఆయాలిపులతో సహజసం బంధము లేదు; అనగా ఒకభాషకు దానియిప్పటిలిపినే వాడుటకు సహజావశ్యకత లేదు. ఉ॥ సంస్కృతగ్రంథములను నాగరిలిపిలోనేగాక, తెనుగులిపిలో ఆంధ్రులు, బెంగాలీలిపిలో బంగాళీలు, మళయాళలిపిలో మళయాళీలు, రోమకలిపిలో యూరపియనులు అచ్చులో, వ్రాతలో చదువుచున్నారుగదా! హిందుస్తానీని కొందరు నాగరిలో, కొందరు నర్దూలిపిలో, ఆంగ్లమిషనరీలు రోమనలిపిలోను చదువుదురు. లిపి అక్షరములు సంజ్ఞార్థం ఉపయోగించు పరికరాలే. వాటిని మనయిష్టము సౌకర్యమునుబట్టి మార్చుకొనుటకు సహజప్రతిబంధము లేదు. టర్కీ వారు తమతుర్కీభాషకు చిరకాలముండిన పారసీలిపికి బదులు రోమక లిపినే యిప్పుడు వాడుచున్నారు. జపానీయులును ఇటీవల అందు కుద్యుక్తులయినారు. కనుక, మనదేశభాషలన్నిటికి ఒకేలిపిని వాడదల చితే, అందుకు ప్రజాభిప్రాయము విద్యావంతుల దీక్షయు, పూనికయు

మాత్రం కావలెను. ఇప్పటికి, దేశప్రజలలో సగటున నూటికి 16 గురు మాత్రం అక్షరాస్యులు. తక్కిన 84 మంది ప్రాప్తిజనులకు ఏలిపియైనను క్రొత్తయే. కనుక, ఈస్థితినిబట్టి గొప్పసంస్కరణచేయుట అసాధ్యము కాదు. ఇందువల్ల ముందుతరములవారి కెంతయో సదుపాయమేర్పడును. కాని, ఈతరములోని మనమందరము ఎక్కువ త్యాగము చేసి, వ్యయప్రయాసల కోర్చి, దీక్షతో కార్యసిద్ధి చేసుకోవలెను. ఇందుకందరునమకూడి, ఏదోలిపిని సామాన్యలిపిగ ఎంచుకోవలెను. అట్టి ఐకమత్యము సాధనదీక్షయు నున్ననే ఏకలిపియుద్యమముసాధ్యపడును. ఏకలిపిపద్ధతివలన ఇప్పటిముద్రణాదుల మొత్తపువ్యయమును తగ్గును. శతాబ్దులుగ అలవడి మనప్రీతిపాత్రమైన ఆయాప్రాంతీయలిపులను విడచుటకు మన సొప్పట చాల కష్టమే; మరియు, ఎవరిలిపి వారికి అందము, సుకరము అనియే తోచును. తమప్రాంతపు లిపినివదలి, ఇతర ప్రాంతపులిపిని గ్రహించుట కొప్పుకొనుట కెంతయో త్యాగబుద్ధియు, దూరదృష్టియు, గాఢమగు జాతీయాభిమానమును కావలెను; పిమ్మట దానియాచరణకు, ప్రభుత్వమును విద్వాంసులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు అందరు సహకరించి సాధించవలెను. మరియు, ఒకటిరెండు తరములవరకైనను ప్రాంతీయలిపి జాతీయలిపి, ఈరెంటిలోను పుస్తకాదు లుండును; అట్లు రెండులిపులకు విద్యావంతు లందరు అభ్యస్తలయినమీదటనే, క్రమముగా సామాన్యలిపినే జాతీయలిపిగ అభిమానించి, అందరు సర్వసమ్మతితో వాడుకొనగల్గుదురు. ఇందుకు భారతీయైక్యమును సాధించు దృఢవిశ్వాసమే మూలకంద మగును.

ఏకలిపిసాధన మనలక్ష్యమను నిర్ణయమునకు విద్వాంసులు వచ్చుకల్పంలో, ఏలిపి అందుకు యుక్తమో తేల్చుకోవలెను. మన తెలుగు మున్నగు ప్రతిలిపిలోను కొంత విశిష్టత కలదు; సామాన్యభావవిషయములోవలె లిపివిషయములోను ఇప్పుడువిశేషవ్యాప్తి గలదానినే ఎన్ను

కొనుట యుక్తమని తుదకు తోచును. ఆలెక్కను తమిళం, ఓఢ్రిం, గుజరాతీ ఇత్యాదులకన్న, తెలుగులిపికి హెచ్చుసంఖ్య కలదు. కన్నడముతో చేర్చిన 5½ కోట్లజనుల లిపి యగును. కాని, నాగరి (=దేవనాగరి) హిందీ, మరాటీల రెంటకి వాడునది. 20 కోట్లజనుల లిపి; ఇది కాక, ఆసేతుహిమాచలము, సంస్కృతభాషకును స్కూళ్ళు ఇత్యాదులలో నాగరినే వాడుచున్నారు. కనుక, నాగరియే ఎక్కువ వ్యాప్తము. హిందీభాష నిప్పుడు అన్నిప్రాంతాలలో సెకండరీస్కూళ్ళలో బోధింతురు. కనుక, అహిందీభాషికమగు మనదక్షిణప్రాంతములోను స్కూలు విద్యార్థులు హిందీ నేర్చుచున్నారు. మరియు, నాగరిలిపికి గుజరాతీ లిపితో బంగాళీలిపితోను చాల పోలిక గలదు. నాగరీ అచ్చుఅచ్చరము లిప్పుడు దాదాపు దేశపుఅన్నిజిల్లాలలో ముఖ్యముద్రాశాలలలో గలవు. కనుక, దేశవ్యాప్తము నాగరియే. రోమను(=ఇప్పటి ఇంగ్లీషు అచ్చు చిన్నఅక్షరాలు) లిపికిని దేశవ్యాప్తి కలదు. మరియు, దానికి యూరపు, అమెరికా, ఆస్ట్రేలియా ఇత్యాది ఖండాంతరములలోను సర్వవ్యాప్తి కలదు. ఈలిపిలో టైపుయంత్రములును సులభములు. అక్షర సంఖ్య తక్కువ, సుకరములును; కనుక రోమనులిపి మనదేశములోను సామాన్యలిపి కావలెనని కొందరి ఆశయము. ఆసౌకర్య ముండుట నిజమే. కాని, అది విదేశీయము. నాగరి మనదేశీయము. (పవిత్రలిపి యనియు కొందరి భావన) అది (ఉర్దూ తప్ప) మనదేశీయలిపు లన్నిటికీ సన్నిహితము; తెలుగు తమిళముతోను దానికి పోలిక కలదని పరిశీలనకు తేలును. ఈఅన్నిలిపులును ప్రాచీనపు'బ్రాహ్మీ' అను ఒకే లిపి నుండియే జనించి, కాలక్రమమున వ్రాతలో వాడెకు పరికరాదులకారణమును ఇప్పటి వేర్వేరు ఆకారముల బొందినవని లిపిశాస్త్రజ్ఞులు నిర్ణయించినారు. అక్షరములవరుస, గుణితము, ఇత్యాదులలోను కొంత సామ్య మున్నది. కనుక, సామాన్యలిపి కావలెనను వారిలో హెచ్చుమంది 'నాగరి' లిపికే సమ్మతించునట్లు తోచును.

నాగరి, రోమను, ఈరెంటిలో నేది సామాన్యలిపియగుననునది ముఖ్యముగ మానసికము. బహుజనాభిమతమయిననే జనాదరముతో వ్యాప్తి నొందగలదు. ముద్రణాదులలో సాంకేతిక సౌకర్యమును, ఖండాంతరవ్యాప్తియు రోమను (=ఆంగ్ల) లిపికే కలదు; కనుక రోమకలిపి కాదులకు హేతుబల మున్నది నిజమే. కాని కొన్ని యితరసౌకర్యముల బట్టి నాగరి కవకాశము హెచ్చుగ గన్పడును. ఈప్రాంతమునకే కాక, దేశమంతటికి సామాన్యలిపి యొకటి యుండుట ఆవశ్యకమని తోచును. అందుకు మహాశయు లంగీకరించుటకు ముందుగ చాల ప్రచార మింకను కావలసియున్నది. ఈలోగా తెలుగు కన్నడముల ఏకీకరణము జరుగుటయు, అట్టి ఏకీభావపుధోరణికి సహకారి కావచ్చు. మొత్తముమీద, ఈలిపిసమస్యనుగూర్చి మహాశయు లందరు దూరదృష్టితో రాబోవుతరములవారి కష్టసుఖములనుగూడ దృష్టిలో నుంచుకొని ఇంకను చర్చించి నిర్ణయముకు రావలెనని నాకోరిక. జనసమ్మతి లేనిదే ఇట్టిసంస్కరణ ఆచరణ సాధ్యము కాదు. కనుక, ధీమంతులు, విద్వాంసులు, ప్రజాక్షేమపరులు దీని నింకను శ్రద్ధతో చర్చించి అభిప్రాయము తెలుపుట ఆవశ్యకము.

ప్రాచీనకాల శిల్ప చిత్రలేఖనములు

శ్రీ విశ్వనాధ నరసింహము

(సంపుటి 47—3 సంచిక తరువాయి)

ఆమె వీణారావముచే నాకర్షింపఁబడిన మృగశాబకము దరిఁ జేరియుండును. ముందటి కాసారము కల్హారముల శోభించుచుండును. వెనుక మధ్యాహ్నకాలమును సూచించు సూర్యుని తీక్ష్ణబింబము. ఆరాగము మధ్యాహ్నకాలమున నాలాపింపవలయుసూచనము. అందుచేత నాచిత్రకారుల రచనలు కేవల మూహామాత్రములే కావనియు జీవితములో మిగుల గంభీరసమస్యలను చిత్రరూపముగా వ్యక్తపఱచు భావవ్యక్తీకరణము లనియుఁ దెలియును. అందు నిశాదృశ్యములుకూడ వ్యక్తములగును. నాయికామణి కన్నులు కలువలఁ బోలియుండుటయు నంగుళులు సుకుమారములై రోజాపూలవలె నుండుటయుఁ దక్కటిసౌందర్యాదులు నాచిత్తరువుల గననగును.

దైవమానవప్రేమములు ప్రాచీనకాలమునుండియు నెఱుఁగఁదగినఁ ప్రశస్తవిషయములుగా నుండును. అయ్యవి కళాదృష్టితోడను శాస్త్రీయముగను పూర్వులు విశదీకరించిరి. అట్లు వివరించిన స్మరకూచిమారాదులలో వాత్స్యాయనుఁడు తత్పూర్వరచనలసమగ్రముగా వ్యాఖ్యానించి తనసిద్ధాంతముల సూత్రీకరించెను. అందు భౌతికములగు ప్రేమికుల నయనోన్మీలన హస్తవిన్యాసాది చేష్టితములేకాక గంభీరతరములగు నైజహృదయ వ్యక్తీకరణములు కూడ నుండుటచే నాగ్రంథము మిగుల సమగ్రము. వైష్ణవమతప్రాదుర్భావప్రచారములును అందలి భక్తిసిద్ధాంతములును ఆయుగమునం దనేక మానసికప్రవృత్తుల నాపాదింపఁజేసెను. భక్తియును దాసభావమును ముక్తిమార్గములుగా నెంచఁబడి జీవితపరమావధిగా గణింపఁబడెను. అట్టిమార్గము వ్యక్తిగతముగా నెం

చేఁబడి ప్రతిభక్తుఁడును భక్తురాలును సంగీతసారస్వతముల మూలమున నర్చనాదులతో ముక్తి నపేక్షించుచుండిరి. భక్త్యావేశపూరితము లగు గేయకావ్యము లానాటి సారస్వతమును వృద్ధి నొందించుచుండెను. నూతనవిధమగు నవ్యక్తమాధుర్యము భక్తుల జీవితములందును కళోపాసనాదికములందును జనించెను. ప్రణయకావ్యములు ప్రణయోత్సవములు నూతనరీతుల ననుసరించెను. చిత్రకారులకును కావ్యకళోపాసకులకును రాధాకృష్ణుల దివ్యప్రణయములే ఇతివృత్తము లగుచుండెను. కొందఱ కయ్యదియే స్త్రీల ననుసరించి యారాధించుట యయ్యెను. నాటిచిత్రకారులకు ప్రణయగాథలఁ జిత్రించుట ప్రత్యేకలక్షణ మయ్యెను. రాగమాలాపరంపరలతో నయ్యది ప్రత్యేకత వహించెను.

నాయికా నాయకులను వారి మానసికప్రవృత్తుల ననుసరించి కొన్నివిభాగములుగ లాక్షణికులు విభజించిరి. అందుఁ బ్రణయోత్సాహము నొందిన నాయికల నష్టవిధశృంగారనాయికలని వారు నిరూపించిరి. అట్టినాయికలు చిత్రకారుల చిత్రరచనల కవలంబనములుగా నుండిరి. శృంగారనాయికల చిత్రరుపులలోని భావవ్యక్తీకరణమును నందలి లక్షణాదికము తెలెంగిన రసికులకు గ్రాహ్యము లయ్యెను. సాధారణ చిత్రములలో నిర్మింపఁ బడిననాయిక 'అభిసారిక' యనఁబడును. రాగరంజితయగు నాయిక నాయకునికొఱ కేగుటయిందలి లక్షణము. దట్టమగు చీకటిలో రంగుచీరె గట్టుకొని నాయిక కాంతానుసరణ మొనర్చును. అపుడే యాకాశమున సాంద్రనీరదంబు లలమి తటిల్లతలమెఱుఁగులతో హోరుమను వర్షధారలకు నరకుసేయక బుసకొట్టు సర్పములకేని భీతిలక ప్రణయవేగమున నామె వడిగా నరుగుచుండును. 'విరహిణి' నాఁబడు నాయికా చిత్రమున భర్తృవియోగమునఁ బరితపించు నాయికఁ గనన గును. విరహతాపోపశమనమునకుఁ జందనచర్చాది శైత్యోపచారము లామెకు చెలికత్తె లొనరించుచుందురు. మఱి యొండు నిర్మాణమున

'విరహోత్కంఠ' యగు నాయక చిత్రకారునితో 'నోయీ ! అహము గతించి రాత్రియగుచున్నది. మరల వేగి సూర్యాస్తమయ మగుచు నీరీతి దినములు మాసములు కూడ గతించుచున్నవి. ఇతరుల బాధనె ఱుంగు నింగితమునీకు లేదా? స్వచ్ఛములగుచిత్రపరికముల నీకొసంగితిని ఎంతకాలమైనను నానాథుని రూపము చిత్రింపవేల' యను భావమును దెల్పు పద్యమాచిత్తరువుక్రింద లిఖితమైనది 'వాసవసంజ్జిక' మొదలగు నాయికల చిత్తరువులు కూడ నాయాలక్షణములతో మనోజ్ఞములగును. అట్టి మనోహర చిత్రంబులు కంగ్రాచిత్రకారులు నిర్మించిరి. రాగమాలాచిత్రంబులు చాలవఱకు రాజస్థానీ చిత్రకారులచే నిర్మితములయ్యె. కావున నవి కొంతముందుగా స్వహాపోత్పత్తులఁ బొందెనని యూహింపవలెను. అని యన్నియు భావవిలసితములై యాదర్శహిందూజీవనపథమును సూచించు ప్రశాంతసౌందర్యములతో విరాజిల్లుచుండును. ఇతర దేశముల నిట్టికల్పనాసౌష్ఠవము, భావమాధుర్యముఁగూడిన చిత్రరచన కానరాదు. రాజపుత్రీయుగమునందలి చిత్రకారు లారీతిగఁబ్రత్యేకవైశిష్ట్యమును చూపి చిత్రకళ నభివృద్ధి నొందించిరి.

మకరతోరణములు.

'ఝషాణాం మకరశ్చాస్మి' అని శ్రీకృష్ణభగవానుఁడు నుడివెను. భారతీయశిల్పి దేవాలయమును నిర్మించి తనహృదయమున నిండారుభక్తి నందుఁ బ్రతిష్ఠచేసి ద్వారములకు మకరతోరణముఁ జెక్కుచున్నాఁడు. హిందూగృహిణి ప్రాతఃకాలమున గృహప్రాంగణము శుభ్రపఱచి గోమయమిళితజలంబులు చల్లి వివిధములగు రంగవల్లికల నేర్పరించును. ద్వారబంధమునకు పసుపురాచి కుంకుమ మలంది పచ్చని యాకుల తోరణములం గట్టి గృహాలంకార మొనర్చును. సాధారణముగ పద్మములేని చెక్కడముకాని మకరతోరణములులేని మందిరములు, దేవాయతనములు, స్థూపములు మున్నగునవికాని మనభారత

భూమి నరు దని చెప్పనగును. అష్టదళపద్మములు, షోడశదళపద్మములు సహస్రదళపద్మములు మున్నగునవి మందిరాలంకారములుగా నెల్లెడలఁ గాన్పించును. దేవాయతనములు, స్థూపములు, జైనమందిరములు మున్నగునవి శిల్పకళావిన్యాసంబున నసమాన సౌందర్యమున నలరారుచు శాశ్వతయశస్సుఁ బొందినవి.

మకరతోరణమునందలి మకరమొక శిల్పచాతుర్యవిశేషమనియు నపూర్వసృష్టియనియు గ్రాహ్యమగుచున్నది. చాళుక్యుల అయిహోలు శిల్పకట్టడమునందలి మకరతోరణములును, పల్లవుల కాలమునందలి మహాబలిపుర దుర్గామందిరముపై నున్న మకరతోరణములును నేత్రపర్వమగు శిల్పచాతుర్యము వెల్లడించును. మధ్యయుగమునాటి సింహళచిత్రకళ యందును మకరము కాన్పించును. మకరమునకు నడుముక్రిందిభాగ మేనుఁగు నడుమును బోలియుఁ బాదములు సింహపాదములవలెను కర్ణములు వరాహకర్ణతుల్యములుగాను శరీరము మత్స్యాకృతితోడను దంతము లూర్ధ్వముఖములుగా నుండినట్లు వర్ణనలఁ దెలియును. అమరావతియందలి చలువఱాతి శిల్పములయందలి మకరతోరణము నూతనసౌందర్యవిరాజితము. అందు శృంగద్వయము క్రిందినై పున కందముగాఁ దిరిగియుండును. ఇట్టికొమ్ము అజంతాచిత్తరువులయందును కానుపించును. అమరావతిశిల్పముల సౌందర్యభంగిమములు స్వరూపలావణ్యములు నాంధ్రశిల్పచిత్రకళల ప్రాశస్త్యచిహ్నములుగా పాశ్చాత్యపండితులచే నెంచఁబడెను. తక్షశిలాశిల్పమునందలి రెండుకాళ్ళ మకరము అమరావతీ మకరముల యనుకరణములని పాశ్చాత్యు లూహించిరి. బౌద్ధచైత్యము లందు గోచరించు తోరణములకు రెండుపార్శ్వముల మకరములును మీఁద సింహముతో గూడిన కీర్తిముఖమునకుఁ గలుపఁబడి యొకవింత సొబగుతోడి యాకారముఁ దాల్చెను. కాలక్రమమున నట్టి మకరతోరణములు శుభచిహ్నములై బౌద్ధుల కట్టడము లన్నింటికి నగపడుచుండెను.

కాంచీపురమునందలి కైలాసనాథాలయమున నాల్గువైపుల వివిధములగు మకరతోరణములతోఁ గూడిన కీర్తిముఖములు మిగుల సుందరములు. వరుణదిక్పాలుని వాహనములో నొకటియు, గంగాదేవి వాహనమును మకరములు. ఎల్లోరాకైలాసగుహయందలి గంగాదేవి వాహనమగు మకరము కనులపండు వొనగించును.

అంతిపురికాంతామణులు కస్తూరి మున్నగు సుగంధ ద్రవ్యములతో మకరికాలతలు చెక్కిళులపై నుంచుకొనుసంప్రదాయ మున్నట్లు తెలియుచున్నది. మకరికాలతలు పత్రభంగము లనఁబడును. నాయికామణి కట్టి విచిత్రాలంకారములు చెలికత్తెలచే నలంకరింపఁబడును. మరియత్యంతప్రేమాస్పదమగు నాయిక గండస్థలంబున నాయకుఁడు పత్రిభంగముల రచియించుట సంప్రదాయము. కామదేవోపాసనఁ జేయు సమయముల మానినీమణులు మకరికాలతలఁ గైసేయుచుండిరి. నాయిక చెక్కుల మకరికాలతల వ్రాయునవకాశమునకై ప్రేమపూరితుఁ డగు నాయకుఁడు దేవతలకు మొక్కుచుండె నని తెలియును.

బాలగోపాల స్తుతి

ప్రాచీనవైష్ణవ చిత్రములలో బాలగోపాలస్తుతి యను నూటయెనిమిది శ్లోకముల గ్రంథము పరిశోధకులచే బిల్వమంగళుని రచనగా నిర్ధారింపఁబడినది. అందలి చిత్తరువులు మనోహరములు. వర్ణరచన యద్భుతము. ఒక్కొకచో నీచిత్రముల యర్థము స్ఫురించుట కష్టము.

"విన్యస్య వేణు మధరే వివరాం స్తకీయా
నవ్యగ్ర మంగుళిభి రంతిరయన్ విచిత్రాన్
గాయన్ కలం శిఖిశిఖండకృతావతంసో
మధ్యేగవాం విజయతే విచర న్ముకుందః"

(తా॥ నెమలిపింఛము నవతంసముగాఁగల ముకుందుఁడు పిల్లనగ్రోవిని నధరమున నునిచి దానిరంధ్రముల వ్రేళుల మూయుచు తెఱ

